## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

هُوَ الَّذِیۡ جَعَلَ لَکُمُ الَّیۡلَ
لِتَسۡکُنُوۡا فِیۡہِ وَالنَّہَارَ مُبۡصِرًا ؕ
اِنَّ فِیۡ ذٰلِکَ لَاٰیٰتٍ لِّقَوۡمٍ یَّسۡمَعُوۡنَ

(سورۃ یونس، آیت 68)

**అనువాదం:** మీరు విశ్రాంతి పొందుటకు రాత్రిని చేసినవాడే అతడు. పగులును ప్రకాశింప జేయునట్టిది చేసెను. (మాటలు) విను వారి కొరకు దీనిలో నిశ్చయముగా వలు సంకేతములు ఉన్నవి.

**(యూనూస్: 68)**

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)


**సంపాదకులు:** సయ్యద్ రసూల్ నియాజ్

**ఉపసంపాదకులు:** ముహమ్మద్ అక్బర్

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR** Qadian

www.akhbarbadr.in

సంపుటి: 10
సంచిక : 10
వార్షిక చందా 600/-రూ॥

**06 మార్చి 2025 క్రీ, శ. 06 అమాన్ 1404 హి, శ.**
**05 రమజాన్ 1446 హి,ఖ.**


## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్ గారికి ఆరోగ్యవంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చుగాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాకా! *(ఆమీన్)*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

## మరల గుర్తుంచుకొనుము. అల్లాహ్‌ను విశ్వసించడం అనేది చాలా గొప్ప విషయం.

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశాలు:**

నేను మరల సహాబా రిజ్వానుల్లాహ్ అలైహి అజ్మయీన్‌ల వ్యవహార శైలిని ఉదాహరణగా మీ ముందు ప్రవేశపెట్టుచూ ఇలా తెల్పుచున్నాను. వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించిన తరువాత తమ ఆచరణల ద్వారా అత్యంత గోప్యమైన మరియు అన్యారాధనలు చేయునట్టి ప్రాణకోటి దృష్టికి కనిపించనటు వంటి దైవ అస్థిత్వమును వారు తమ కన్నులతో, నిజంగానే తమ కన్నులతోనే చూశారు. అలా కానిచో మరి వారు ఏ కారణంగా, తమ జాతి ప్రజలను, తమ జన్మస్థలాన్ని, తమ ఆస్థులను వదిలి వేశారు, తమ సమీప బంధువు మిత్రుల నుండి ఎందుకు దూరమైనారో మీరే చెప్పండి. అది కేవలం అల్లాహ్ తాలాపై ఉన్నటు వంటి నమ్మకం మాత్రమే. ఏకేశ్వరుడైన అల్లాహ్‌పై నమ్మకాన్ని పెంచుకోనే వారు అలా చేసి చూపారు. ఒకవేళ చరిత్ర పుటలను తిరగవేసినచో మానవుడు ఆశ్చర్యము మరియు విచిత్రముతో నిండిపోతాడు. వారిలో విశ్వాసం ఉన్నది. కేవలం విశ్వాసం మాత్రమే ఉన్నది. అంతకు మించి మరేమి లేదు. అందుకు భిన్నముగా చూసినచో ప్రాపంచీకులు ఎత్తుగడలు, వ్యూహాలు, అన్ని రకాల ప్రయత్నాలు, కార్యచరణలు చేశారు. అయినా కూడ వారు అనుకున్నది సాధించలేక పోయారు. వారు సంఖ్యా పరంగా, సమూహపరంగా, సంపద పరంగా అన్నింటిలో చాలా ఎక్కువగానే ఉన్నారు. కాని వారిలో విశ్వాసమే లేదు. కేవలం విశ్వాసం లేనందుకే వారు నాశనమై పోయారు. తాము అనుకున్నది సాధించక ముందు మరణించారు. కాని సహబాలు తమ విశ్వాస బలంతో అన్నింటిని జయించారు. వారందరు కేవలం ఒక వ్యక్తి పిలుపును విన్నారు, ఆ వ్యక్తి నిరక్ష్యరాస్యుడిగానే పోషించబడినప్పటికి, తమ సత్యత, న్యాసత మరియు ధర్మబద్ధత వలన చాలా ప్రాచుర్యంను పొందారు. ఆ వ్యక్తి నేను అల్లాహ్ తాలా వైపు నండి అవతరించ బడ్డాను అని ప్రకటించుకోగానే, ఆ ప్రకటన విన్న వెంటనే ఆ వ్యక్తితో కలిసిపోయారు. ఆపై పిచ్చివారి వలే వారిని అనుసరించడం ప్రారంభించారు. నేను మరల తెల్పుచున్నాను. వారి స్థితిని ఇలా మార్చివేసింది కేవలం ఒకే ఒక సాధనం. అది వారిలో ఈ పరిస్థితిని సృష్టించింది. ఆ సాధనం విశ్వాసం. మరల గుర్తుంచుకొనుము. అల్లాహ్‌ను విశ్వసించడం అనేది చాలా గొప్ప విషయం.

ఆంగ్లేయ మరియు పాశ్చాత్య జాతులకు చెందిన జాతుల వారు ప్రాపంచిక అన్వేషణలో, ఆకాంక్షలో మునిగి ఉన్నారు. ప్రారంభ కాలంలో ఒక సందిగ్ధత మరియు నమ్మకంతో పనిని ప్రారంభించేవారు. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది, లక్షలాది రూపాయాలు వ్యర్థమైనాయి. చివరికి ఒక ఆనందాన్ని పొందుతారు. దేవుడు మనకు లభించడు అని పలుకువారిని చూసినచో ఎంతో విచారం మరియు బాధ కల్గుతుంది. ఎవరు పూర్తిగా కృషి చేశారు?. ఎవరు ప్రయత్నించారు? ఎందుకు వారు దేవుడిని పొందలేక పోయారు. దేవుడు దొరుకుతాడు. త్వరగా దొరుకుతాడు. కాని అతనిని పొందువారు ఎక్కడా?.

**(మల్ఫూజాత్ సంపుటి 2, పేజి 42, ఎడిషన్ 2018)**

## అల్లాహ్ తాలా నుండి ఈ భూమిపై ఏదైన పరంపర స్థాపించబడినప్పుడు, షైతాన్‌తో అనుబంధాన్ని కల్గిఉన్నటు వంటి కొన్ని దుష్ట ఆత్మలు తమ ప్రతాపాన్ని చూపిస్తుంటాయి.

**(గత సంచిక తరువాత)**

ఒక చిన్న బాలుడినే భయపెట్టుటకు ఒక బావిలోకి వేస్తున్నట్లుగా నెట్టి చూడుము. అతడు ఎంత గట్టిగా పట్టుకుంటాడో తెలుస్తుంది. అతని సాధారణ బలం కంటే 10 రెట్లు అధిక బలం అతనిలో జనిస్తుంది. అదే విధముగా కుస్తి పోటిలో ఒక వీరుడు తన ప్రత్యర్థిని ఒక్క నిమిషంలో నేలమీద పడవేయవచ్చును. కాని అదే ప్రత్యర్థిని బావిలో పడేయుటకు ప్రయత్నించి చూడుము, ఒక్క నిమిషం కాదు కదా, ఒక గంట సమయమైన అతనిని బావిలో పడవేయలేడు. ఎందుకనగా అతడు కుస్తిని పోటిగా మాత్రమే భావిస్తాడు. అందుకని ఒకవేళ ఓడిపోయినా కూడ ఏమవుతుంది? అని అనుకుంటాడు. కాని ఎప్పుడైతే అతనిని చంపబోతున్నారు అని తెలుస్తుందో అప్పుడు అతడు తన బలం మొత్తాన్ని కూడ గట్టుకుంటాడు. ఆ క్రమంలో అతడు తన పోటి దారుడికి సమానమైన బలాన్ని సమకూర్చుకుంటాడు, లేదా సుమారుగా ఇంచుమించు వరకు చేరుకుంటాడు. అదే విధముగా ఎప్పుడైతే అల్లాహ్ తాలా ఈ భూమండలంపై తన వ్యవస్థను స్థాపించు తాడో అప్పుడు షైతాన్‌తో అనుబంధాన్ని కల్గియున్న కొన్ని దుష్టఆత్మలవారు లేదా కొన్ని పాపాల వలన షైతాన్ ప్రభావానికి లోనైన వారు ఉద్రేకానికి గురి అవుతారు. ఆపై ఏ విధముగానైన సరే ప్రపంచంలో నిజాయితి వ్యాపించకూడదు అని అడ్డుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తారు. దైవ పరంపరను అడ్డుకోవడానికి నిలబడే వారు కొన్ని సార్లు ఆ వ్యవస్థలో పేరు కోసమే చేరుతుంటారు. ఇందుకు ఉదా॥ అబ్దుల్లాహ్ బిన్ ఉబై బిన్ సులూల్. అలాంటివారితో సాన్నిహిత్యం ఉన్నవారు కూడ పేరు కోసమే పాల్గొంటారు.

**(12వ పేజిలో చదవండి)**

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

■ హజ్రత్ అబూహురైర రజియల్లాహ్ అన్‌హుఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. చాలా ఎక్కువగా పాలు ఇచ్చునట్టి ఒంటెను బహుమానంగా ఇవ్వడం ఎంత గొప్ప విషయమో. అదే విధముగా చాలా ఎక్కువగా పాలు ఇచ్చునట్టి మేకను కూడ బహుమానంగా ఇవ్వడం ఎంతో గొప్ప విషయం. అది ఉదయం మేత కోసం వెళ్ళడానికి ముందు ఒక పాత్ర నిండా పాలు ఇచ్చునదై, మేత నుండి తిరిగి వచ్చిన తరువాత మరల ఒక పాత్ర నిండా పాలు ఇచ్చునదై ఉండాలి.

■ హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజియల్లాహు అన్‌హుమా ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. ఉత్తమ సుగుణాలు 40 వరకు ఉన్నాయి. వాటిలో అత్యున్నతమైన సుగుణం ఎక్కువగా పాలు ఇచ్చునట్టి మేకను బదులుగా ఇవ్వడం. ఎవరైతే పుణ్యం లభిస్తుందనే నమ్మకంతో, అల్లాహ్ తాలా పుణ్య వాగ్దానం నిజమైనదని భావించి ఆయా సుగుణాలలో ఏ ఒక్క సుగుణాన్ని అలవర్చుకున్నచో, అల్లాహ్ తాలా చేసిన వాగ్దానంను నమ్మినందున అల్లాహ్ తాలా అతని నమ్మకం మరియు విశ్వాసం వలన అతనిని స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు.
హస్సాన్ ఇలా తెలిపారు. మేము ఎక్కువగా పాలు ఇచ్చునట్టి మేకలను కానుకగా ఇచ్చే సుగుణాన్ని వీడి ఇతర సుగుణాలను లెక్కించేవారము. ఉదా॥ సలాంకు ప్రతిగా సమాధానం ఇవ్వడం, తుమ్మినప్పుడు దుఆ చదవడం, దారిలో ఉన్నటు వంటి ఇబ్బంది కర వస్తువులను తీసి ప్రక్కకు వేయడం వంటి ఇతర సుగుణాలను లెక్కించుకునే వారము. కాని మేము కేవలం 15 సుగుణాలనే అలవర్చుకోగలిగాము.

**(సహి బుఖారి, సంపుటి 4, కితాబుల్ హిబా)**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

**దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు:**
**అబ్‌షిరూ యా మఅషరల్ మూమినీన బినస్‌రిల్లాహి తాలా వ అవ్‌నిహీ.**
**ఓ విశ్వాసుల సమాజమా! అల్లాహ్ తాలా యొక్క సహాయ, సహకారాలు అందుకోబోవుచున్నందుకు సంతోషించండి.**
**........ ఒకానొక సమయంలో నేను ఖాన కాబా చుట్టూ ప్రదక్షణలు చేస్తుంటాను. దాని తాళం చెవులు నా చేతికి అందించబడును. ఖైసర్ మరియు కిస్రాలు నాశనమైపోతారు. వారి సంపద మొత్తం అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయబడుతుందనే విషయాన్ని నేను బలంగా నమ్ముతున్నాను.**

**కొన్ని సందర్భాలలో మన నవ యువకులు కూడ ఇతరుల మాటలు విని ఆ సమయంలో బనూ ఖురైజాపై ఎందుకు దౌర్జన్యం చేశారు? అని ప్రశ్నిస్తుంటారు. నిజానికి వారు ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అందుకే వారిని శిక్షించడం జరిగింది. అంతేగాని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విధించిన శిక్ష దౌర్జన్యం అనబడదు.**

**అహజాబ్ యుద్ధంలో ఆహార సంవృద్ధికి చెందిన ఘటనలు, ఖందకం త్రవ్వుచున్న సమయంలో విశ్వాసులు మరియు కపట విశ్వాసుల వ్యవహార శైలి, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం యుద్ధం కోసం చేసిన ఏర్పాట్లు, ముసల్మానుల సంఖ్యా, అన్యారాధులు ముసల్మానులపై దాడి చేయుటకు మదీనాకు చేరుకోవడం, ఆ తరువాతి పరిస్థితులు, బనూ ఖురైజా తెగవారి ద్రోహం ప్రస్తావన.**

**ఈ రోజు నుండి ఖుద్దాముల్ అహ్మద్ యు.కే యొక్క వార్షిక సమావేశం ప్రారంభ మవుతున్నది. యువకులు ఈ సమావేశాల నుండి పూర్తి స్థాయిలో ప్రయోజనాలను పొందడానికి ప్రయత్నించాలి.**
**నేను ముందుగా సూచించిన మేరకు ఆయా దుఆలను, దరూద్‌లను పఠిస్తూ ఉండాలి. ప్రత్యేకించి ఈ రోజులలో వీటివైపు చాలా శ్రద్ధను చూపండి. అల్లాహ్ తాలా అన్ని విధాల షైతాన్ దాడుల నుండి ప్రతి ఒక్కరిని కాపాడుగాకా!.**

**గౌ॥ హబీబుర్రహ్మాన్ జేర్వీ రబ్వా, డాక్టర్ సయ్యద్ రియాజుల్ హసన్, ప్రొఫేసర్ అబ్దుల్ జలీల్ సాధిఖ్ రబ్వా, మాస్టర్ మునీర్ అహ్మద్ సాహెబ్ జంగ్‌ల విశిష్టతల ప్రస్తావన, పరోక్ష జనాజ నమాజ్ చదువించు ప్రకటన.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 20 సెప్టెంబర్ 2024, ( 20 తబూఖ్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ
أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

అహజాబ్ యుద్ధంను ఆధారం చేసుకోని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి జీవిత చరిత్ర ఘట్టాలను ప్రస్తావించడం జరుగుతుంది.

నేను గత జుమా ప్రసంగంలో అహారంలో సంవృద్ధికి చెందిన మహత్యమును గూర్చి ప్రస్తావించాను. అదే విధముగా ఖర్జూర ఫలములలో కూడ సంవృద్ధి చెందిన మరొక ఘటన గలదు. ఆ ఘటన యొక్క వివరాలు ఇలా ఉన్నాయి. ఖందకం యుద్ధ సమయంను గూర్చిన ఒక కథనములో ఇలా గలదు. హజ్రత్ బషీర్ బిన్ సఅద్ రజి గారి కుమార్తె ఇలా తెలియజేశారు. నా తల్లిగారైన అమ్ర బిన్త్ రవాహా నా దుస్తువులో కొన్ని ఖర్జూర ఫలమును పోస్తూ, బిడ్డా! వీటిని మీ తండ్రి గారికి మరియు మామ గారికి ఇచ్చి, ఇవే మీ ఉదయపు భోజనం అని చెప్పిరా అని పంపినది. ఆ కుమార్తె ఇలా తెలిపినది. నేను ఆ ఖర్జూర ఫలములను తీసుకోని బయలు దేరినాను. నా తండ్రిని మరియు మా మామగారిని వెదుకుతూ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమీపం నుండి వెళ్ళుచుంటిని. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నన్ను చూసి ఓ బాలికా! నీవు ఏమి తీసుకవెళ్ళుచున్నావు? అని అడిగారు. అందుకు నేను ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం! ఇవి ఖర్జూర ఫలములు. వీటిని నా తల్లిగారు నా తండ్రిగారైన బషీర్ బిన్ సఅద్ మరియు మా మామగారైన అబ్దుల్లాహ్ బిన్ రవాహాల కొరకు పంపించారు అని సమాధానం ఇచ్చాను. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఇలా అన్నారు. వాటిని నా వద్దకు తీసుకురా!. నేను ఆ ఖర్జూర ఫలములను హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం చేతికి ఇచ్చాను. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ ఖర్జూర ఫలములను ఒక వస్త్రంలో వేశారు. ఆపై మరొక వస్త్రముతో వాటిని కప్పివేశారు. ఆ తరువాత ప్రజలను పిలవమని మరొకరితో అన్నారు. ఆ క్రమంలో ఖందకం త్రవ్వే ప్రజలందరు ఏకమైనారు. వారు ఆ ఖర్జూర ఫలములను తింటున్నారు. ఆ తరుణంలో ఖర్జూర ఫలములు అధికమయ్యాయి. చివరికి అందరు తిన్న తరువాత చూసినచో ఆ వస్త్రపు అంచునుండి ఖర్జూర ఫలములు క్రిందపడిపో సాగాయి. **(సీరత్ ఇబ్నే హష్షామ్, పేజి 623-624, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్)**

అహారంలో సంవృద్ధి చెందిన మరికొన్ని ఘటనలు ఉన్నాయి. ఉబైదుల్లాహ్ బిన్ ఉబై ఇలా ఉల్లేఖించారు. ఉమ్మే అమీర్ అష్హలియ గారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు ఒక పాత్రలో హైస్ అనే పదార్థంను పంపారు. హైస్ అనగా ఖర్జూర, నెయ్యి, పన్నీరుతో తయారు చేయునట్టి ఒక వంటకం. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ శిభరంలో హజ్రత్ ఉమ్మే సల్మా రజి గారితో ఉన్నారు. హజ్రత్ ఉమ్మే సల్మా రజి తమ ఆకలి మేరకు ఆ పాత్రలో నుండి భుజించారు. ఆ తరువాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ పాత్రను తీసుకోని బయటకి వచ్చారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సహచరుడు ఒకరు ఖందకం త్రవ్వే ప్రజలందరిని భోజనం కోసం పిలిచారు. ఖందకం త్రవ్వే ప్రజలందరు ఆ పాత్రలో నుండి ఆకలి తీరునంత వరకు భుజించారు. ఆ తరువాత చూసినచో ఆ వంటకం మొదట్లో ఉన్నంతగానే ఉన్నది. అందులో ఏ మాత్రం తగ్గుదల రాలేదు. **(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 4, పేజి 370, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్)(లుఘతుల్ హదీస్ సంపుటి 1, పేజి 542)**

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం దైవాన్వేషి స్థాయిని గూర్చి ప్రస్తావించుతూ ఇలా తెలిపారు. ఏ విధముగానైతే నిప్పు ఇనుము రూపాన్ని తనలో దాచుకుంటుందో, మరియు చూడడానికి ఆ ఇనుము కూడ నిప్పు కణం వలే కనిపిస్తుందో అదే విధముగా దైవాన్వేషి అల్లాహ్ తాలా యొక్క సామిప్యతను సాధించుతారు. దానినే లిఖా స్థాయి అని అంటారు. ఈ స్థాయిలను గూర్చి అనగా లిఖా మరియు సాలిక్ అనే స్థాయిలను గూర్చి వివరిస్తూ హుజూర్

(అ) ఇలా తెలిపారు: " ఇంతటి ఖిఖా స్థాయిలో కొన్ని సార్లు మానవుని ద్వారా మానవ శక్తి సామర్థ్యములకు మించిన వ్యవహారాలు జరుగుతుంటాయి. వాటిలో దైవశక్తి గోప్యముగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ క్రమంలోనే మన ప్రియతమ అధికారి, ప్రవక్తల నాయకులు, హజ్రత్ ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లం బదర్ యుద్ధంలో ఒక పిడికెడు ఇసుకను శత్రువులపై విసిరినారు. ఆ పిడికెడు ఇసుక ఎలాంటి దుఆ ప్రమేయం లేకుండానే, స్వయముగా హుజూర్ (స) తమ ఆధ్యాత్మిక శక్తితో ఆ ఇసుకను విసిరారు. అలా ఆ పిడికిలి దైవ శక్తిని చూపించింది. అనగా శత్రువు సైన్యంపై అది ఎంతటి మహత్యంను చూపిందనగా, శత్రువు సైనికుల కన్నులపై ప్రభావం చూపింది. ఫలితముగా అందరు అంధుల వలే వ్యవహరించ సాగారు. అంతేగాకా వారు అట్టి ఆందోళనకర మరియు చికటిని తలపించు స్థితిలో స్పృహలేని వారి వలే పరుగులు తీయడం ప్రారంభించారు. ..... ఇలాంటి మరెన్నో మహత్యములు జరిగాయి. వాటిని తమ స్వీయ ఆధ్యాత్మిక శక్తితోనే ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రదర్శించారు. వాటిలో ఏ ఒక్కదానిలో దుఆల ప్రమేయమే లేదు. అనేక సార్లు కేవలం ఒక పాత్రలో ఉన్నటు వంటి నీటిలో తమ వ్రేళ్ళను వేయగా, ఆ నీరు ఎంత అధికమైనదనగా, సైన్యంలో ఉన్నటు వంటి ఒంటెలు, గుర్రాలు, ఆ నీటిని త్రాగాయి. అయినా కూడ ఆ నీరు అలాగే మొదట్లో ఉన్నంతగానే ఉన్నది. మరికొన్ని సార్లు రెండు, మూడు రొట్టెలపై చేయి వేయగా, అవి వేలాది మంది ఆకలిని తీర్చాయి. అందుకు కడుపు నిండా భుజించారు. కొన్ని సందర్భాలలో కొద్దిగా ఉన్నటు వంటి పాలను కేవలం తమ శుభప్రదమైన లాలజలంతో ఒక సమూహపు ఆకలిని తీర్చారు. కొన్ని సార్లు ఉప్పు నీటి బావిలో తమ శుభప్రదమైన లాలజలంను వేసి ఎంతో తీయని నీటి బావిగా మార్చినారు. అనేకసార్లు తీవ్రమైన గాయలపైన తమ శుభప్రదమైన చేతితో రుద్ది ఆ గాయాలను స్వస్థ పరిచారు. కొన్ని సార్లు యుద్ధం వలన బయటికి వచ్చిన కన్ను గ్రుడ్లను తమ శుభ ప్రదమైన చేయి వలన ఆ కన్నును మరల సరిచేసి వారి బాధలను తగ్గించారు. ఇలాంటి ఎన్నో మహత్తరమైన కార్యములను తమ స్వీయ ఆధ్యాత్మిక శక్తితో నిర్వహించారు. ఆ కార్యక్రమాల వెనకాల ఒక దైవ శక్తి దాగియున్నది. "

**(అయినా కమాలాతే ఇస్లాం, రూహాని ఖజాయిన్ సంపుటి 5, పేజి 65-66)**

ఖందకం త్రవ్వుచున్న సమయంలో కపట విశ్వాసులు మరియు విశ్వాసుల పరిస్థితులను గూర్చిన ప్రస్తావన గలదు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్నే ఇస్‌హాఖ్ ఇలా వ్రాసారు. ఎంతో మంది కపట విశ్వాసులు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ముసల్మానుల పనులలో చాలా నిర్లక్ష్యం వహించారు. వారు కొద్దిపాటి పని చేసేవారు, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియ జేయకుండానే, అనుమతి తీసుకోకుండానే తమ తమ ఇళ్ళకు వెళ్ళిపోయేవారు. ముసల్మానులకు ఏదైన అవసరం వచ్చినచో వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకోని ఇంటికి వెళ్ళడానికి అనుమతిని తీసుకునేవారు. ఇది విశ్వాసుల పరిస్థితి. కాని కపట విశ్వాసులు అనుమతి తీసుకోకుండానే వెళ్ళిపోయే వారు. విశ్వాసులు అడిగేవారు. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారికి అనుమతిని ఇచ్చేవారు. వారు తమ పనిని పూర్తి చేసుకోగానే మరల తిరిగి వచ్చేవారు. **(సుబులుల్ హుదా వ ర్రిషాద్, సంపుటి 4, పేజి 370, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్)**

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం యుద్ధం కోసం చేసిన ఏర్పాట్లను గూర్చిన మరిన్ని వివరాలు ఇలా ఉన్నాయి. కథనాలలో పేర్కొన్న ప్రకారంగా చూసినచో, అబూసుఫ్యాన్ సైన్యం రావడానికి మూడు రోజుల ముందు వరకు ఖందకం పని పూర్తి అయ్యినది. ఇప్పుడు ముందుగా నిర్ణయించుకున్న వ్యూహం ప్రకారం ఖందకం త్రవ్వడంలో పాల్గొన్న పిల్లలు మరియు కొంత మంది యువకులను కూడ మహిళలు సురక్షితముగా ఉన్నటు వంటి కోటల వద్దకు కాపాల కోసం పంపించారు. కాని 15 సంవత్సరాల వయస్సు గల బాలురులను యుద్ధంలో పాల్గొనుటకు లేదా కోటలలోకి వెళ్ళిపోవుటకు అనుమతించారు. ఏ నవ యువకుల కైతే యుద్ధంలో పాల్గొనుటకు అనుమతి లభించినదో వారి పేర్లు ఈ విధముగా ఉన్నాయి. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజి, హజ్రత్ జైద్ బిన్ సాబిత్ రజి, హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ రజి, హజ్రత్ బరా బిన్ ఆజిబ్ రజిలు.

**(సుబులుల్ హుదా వర్రిషాద్ సంపుటి 4, పేజి 371, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ ) (ఘజ్వా అహజాబ్, బష్మీయిల్, పేజి 175, నఫీస్ అకాడమీ కరాచీ)(వికీపీడియా ఘజ్వాయే ఖందఖ్)**

ఇబ్నే హష్షామ్ గారి కథనము మేరకు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాలో తమ ప్రతినిధిగా ఇబ్నే ఉమ్మే మక్తూమ్ రజిను నియమించారు. మరియు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సలఅ కొండ ముందు భాగంలో శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సలఅ మదీనాకు ఉత్తర దిక్కులో ఉన్నటు వంటి ఒక కొండ. నేడు ఆ కొండ మస్జిదే నబ్వీ నుండి సుమారు 500ల మీటర్ల దూరంలో ఉన్నది. ఆ కొండను తమ వెనకాల ఉండునట్లుగా, ఖందకం ముందు భాగంలో ఉండు నట్లుగా ఏర్పాట్లు చేసుకున్నారు. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సైన్యం కూడ అక్కడే ఉన్నది. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం కోసం చర్మ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముహాజిర్ల జెండా హజ్రత్ జైద్ బిన్ హారిస రజి చేతిలో ఉన్నది. అన్సారులా జెండా హజ్రత్ సఅద్ బిన్ ఉబాదహ్ రజి చేతిలో ఉన్నది.

**(సుబులుల్ హుదా వర్రిషాద్, సంపుటి 4, పేజి 371, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్) (వికీపీడియా సలఅ పహాడ్)**

ముసల్మానుల సంఖ్యను గూర్చి చరిత్ర కారులు అనేక విభిన్న కథనాలను వ్రాసారు. కొందరి దృష్టిలో 900లకు పైబడి యున్నదని, మరి కొందరి దృష్టిలో 700లకు పైబడి ఉన్నదని, కొందరి దృష్టిలో 2000ల వరకు ఉన్నదని, మరి కొందరి దృష్టిలో 3000ల వరకు ఉన్నదని పేర్కొన్నారు.

**(సుబులుల్ హుదా వర్రిషాద్ సంపుటి 4, పేజి 371, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్)(ఘజ్వా అహ్‌జాబ్, బాష్మీల్ పేజి 178, నఫీస్ అకాడమీ కరాచి)(అల్ సహీ మన్ సీరతున్నబ్వీ సల్లల్లాహు అలైహి వసల్లం అల్ అఅజం, పేజి 297, సంపుటి 10)( సీరత్ ఇన్‌సైక్లోపీడియా పేజి 300, ప్రచురణ దారుస్సలాం)**

అనేక చోట్ల ముసల్మానుల సంఖ్యను అనేక విధాలుగా పేర్కొన్నారు. చరిత్ర కారులు ఈ సంఖ్యను ప్రస్తావించడంలో చాలా కష్టాలను ఎదుర్కొన్నారు. వారు ఎప్పుడు సంఖ్యాను ప్రస్తావించదలచినా కూడ ఏదో ఒక కథనమునకు ప్రాధాన్యతను ఇచ్చి మిగిలిన కథనాలను తప్పుడు కథనాలుగా పేర్కొనేవారు. కాని హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హు ఎంతో దివ్యదృష్టితో వాటిలో ఏ ఒక్క కథనాన్ని ఖండించకుండా అన్ని కథనాలను ఒకదానితో మరొక దానిని కలుపుతూ వాటి వాస్తవాన్ని ఇలా ప్రస్తావించారు. "ఈ సందర్భములో ముసల్మానుల సైన్యపు సంఖ్యను గూర్చి చరిత్ర కారులు తీవ్ర విభేదాలకు గురైనారు. కొందరు ముసల్మానుల సంఖ్యను 3000 అని వ్రాసారు. మరి కొందరు 12 నుండి 13 వందల మంది అని పేర్కొన్నారు. మరికొందరు 700ల మంది అని పేర్కొన్నారు. ఇంత పెద్ద వత్యాసంను సరి చేయడం బాహ్యముగా చూసినచో చాలా కష్టమైన పనిగా అనిపిస్తుంది. అందువలనే చరిత్ర కారులు ఈ విభేదాలను సరిచేయలేక పోయారు. కాని నేను ఆ కథనాల వాస్తవికతను తెలుసుకున్నాను. నా దృష్టిలో ఆ పైన పేర్కొనబడిన 3 రకాల కథనాలు పూర్తిగా సత్యమైనవే.

ఉహద్ యుద్ధంలో కపట విశ్వాసులు వెనుదిరిగి వెళ్ళిన పోయిన సమయంలో ముసల్మానుల సైన్యంలో కేవలం 700ల మంది ఉన్నారనే విషయాన్ని ఇంతకు ముందే తెలియజేయడం జరిగింది. ఆ యుద్ధం తరువాత కేవలం 2 సంవత్సరాలకే అహజాబ్ యుద్ధం జరిగింది. ఈ మధ్య కాలంలో ఏదేని పెద్ద తెగ కూడ ఇస్లాంను స్వీకరించి మదీనాలో నివాసంను ఏర్పర్చుకోలేదు. అందువలన ముస్లిం సైన్యం 700ల మంది నుండి ఒక్కసారిగా 3000ల మంది వరకు పెరిగిపోవడం సాధ్యం కాని విషయం. " అనగా 700ల మంది ఉన్నటు వంటి ముసల్మానులు ఎవరు ఇస్లాంలో చేరకున్నను 3000ల మంది వరకు పెరిగి పోయారనడం సాధ్యం కాదు. " మరోవైపు ఉహద్ యుద్ధం జరిగిన 2 సంవత్సరాల తరువాత కూడ ఉహద్ యుద్ధంలో పాల్గొన్నంత మంది సైనికులే ఉంటారనడం కూడ సాధ్యం కాని విషయం. " ఎంతో కొంత పెరిగి ఉండవచ్చును. " కావున ఈ రెండు అంశాలను దృష్టియందుంచుకోని చూసినచో ఆ కథనాలన్నియు సరైనవిగా అర్థమవుతాయి. ఎందుకనగా యుద్ధం చేయు అర్హతగల ముసల్మానుల సంఖ్య అహజాబ్ యుద్ధ సమయానికి 1200ల మంది వరకు ఉన్నారు.

ఇక మరి కొందరు 3000ల మంది ఉన్నారు అని, మరి కొందరు 700ల మందియే ఉన్నారు అని వ్రాసారు కదా? మరి ఆ కథనాల సంగతి ఏమిటి? అని ఇక్కడ ప్రశ్న తలెత్తవచ్చును. అందుకు సమాధానం ఏమిటనగా, ఈ రెండు కథనాలను వేరు వేరు సందర్భాల దృష్ట్యా మరియు వేరు వేరు కోణాలలో ప్రస్తావించడం జరిగింది. అహజాబ్ యుద్ధం మూడు భాగాలలో జరిగింది. మొదటి భాగం ఏమిటనగా, శత్రువులు ఇంకా మదీనా వరకు చేరుకోవడానికి ముందు సమయం. అనగా ఖందకం త్రవ్వుచున్న సమయం. ఆ ఖందకం త్రవ్వే పనిలో మట్టిని ఎత్తిపోసే పనులు చిన్న పిల్లలు కూడ చేస్తారు. మహిళలు కూడ అలాంటి పనులు చేయగలరు. కావున ఈ కోణంలో చూసినచో ఖందకం త్రవ్వుచున్న సమయంలో ముసల్మానుల సైన్యంను 3000లుగా పేర్కొనడం జరిగింది. అయితే ఈ మూడు వేలలో పిల్లలు మరియు అనుచరురాల్ల ఉత్సాహంను చూసినచో ఈ పనిలో మహిళలు కూడ ఉన్నారు అని చెప్పవచ్చును. బహుశా వీరు ఖందకం త్రవ్వే పని చేయకున్నను, మట్టి ఎత్తిపోయడం, ఇతర సహాయక పనులలో సహాయం చేయవచ్చును. ఇది కేవలం నా ఒక్కరి ఆలోచనయే కాదు. " వారు రజి ఇలా తెలిపారు. ఇది కేవలం నా ఆలోచనయే కాదు, నిజానికి " చరిత్రను చూసినచో నా ఈ ఆలోచనలకు బలం చేకూరుతుంది. అందువలనే ఇలా లిఖించబడింది. ఖందకం త్రవ్వే సమయం వచ్చినప్పుడు పిల్లలను కూడ ఏకం చేయడం జరిగింది. పురుషులందరు వారు పిల్లలైనను, పెద్దలైనను అందరు ఖందకం త్రవ్వే పనులలో పాల్గొన్నారు. ఆ తరువాత శత్రు సైన్యం వచ్చి, యుద్ధం ప్రారంభమైనప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలురులందరిని ఇళ్ళకు వెళ్ళిపొమ్మని ఆదేశించడం జరిగింది. 15 సంవత్సరాలు నిండిన బాలురులను మాత్రం యుద్ధంలో పాల్గొనుటకు లేదా ఇళ్ళకు వెళ్ళుటకు అనుమతించడం జరిగింది.

ఈ కథనాల ద్వారా తెలియునదేమనగా, ఖందకం త్రవ్వే సమయంలో ముసల్మానులు సంఖ్య పరంగా అధికముగా ఉన్నారు. యుద్ధ సమయంలో తక్కువ

సంఖ్యలో ఉన్నారు. ఎందుకనగా యుక్త వయస్సుకు రాని బాలురులను వెనుకకు పంపించడం జరిగింది. కావున ఏయే కథనాలలో 3000ల మంది ఉన్నారని పేర్కొనడం జరిగిందో ఆయా కథనాలు ఖందకం త్రవ్వే సమయంలో ఉన్నటు వంటి ముసల్మానుల సంఖ్యను గూర్చి తెలియజేయడం జరిగింది. వారిలో చిన్న పిల్లలు కూడ లెక్కించబడ్డారు. ఇతర యుద్ధాల విధానంను చూసి నేను అంచనా వేసి చెప్పినట్లుగా కొందరు మహిళలు కూడ పాల్గొన్నారు. " ఎందుకనగా ఇతర యుద్ధాలలో కూడ కొంత మంది మహిళలు పాల్గొన్నట్లుగా మనకు కథనాలు గలవు. " మొత్తానికి 1200ల మంది సైనికుల సంఖ్య యుద్ధం ప్రారంభమైనప్పటి సమయంను గూర్చి పేర్కొనబడింది. ఆ సమయంలో కేవలం యువకులు మాత్రమే ఉన్నారు.

ఇక 700ల మంది ఉన్నట్లుగా పేర్కొనునట్టి కథనమును చూసినచో అది నిజమేనా? అనే ప్రశ్న తలెత్తుతుంది. 3000ల మంది నుండి 1200ల మంది వరకు వచ్చిన కథనాలను సరైనవిగా స్వీకరించాము. కావున ఇక 700లు ఉన్నట్లుగా పేర్కొన్నటు వంటి కథనాలు సరైనవా? అని కూడ చూడాలి. అందుకు సమాధానం ఏమనగా, ఈ కథనాలను ఇబ్నే ఇస్‌హాఖ్ రచయిత పేర్కొన్నాడు. పైగా వారు చాలా పేరు ప్రఖ్యాతలు గల చరిత్రకారులు. పైగా ఇబ్నే హజమ్ లాంటి గొప్ప ధార్మిక పండితుడు ఆ కథనాన్ని చాలా బలపర్చినాడు. అందువలన ఆ కథనాలను కూడ అనుమానించలేము. " ఇవి కూడ సరైనవి. " ఈ విధముగా కూడ వాటిని సరైనవిగా పేర్కొనవచ్చును. అనగా చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించి చూసినచో యుద్ధం కొనసాగుతున్నప్పుడు బనూ ఖురైజ తెగవారు శత్రువులతో కలిసి పోయారనే, వారు మదీనాపై అకస్మత్తుగా దాడి చేయాలనుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. అలా వారి ఉద్దేశాలు బహిర్గతమైనాయి. అందువలన రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బనూ ఖురైజా తెగ వారు ఉన్నటు వంటి వైపు రక్షణ ఏర్పాట్లు తప్పనిసరి అని భావించారు. అంతకు ముందు బనూ ఖురైజా వారు మనతో ఉన్నారు, శత్రువులను మదీనాపై దాడి చేయకుండా అడ్డుకుంటారు అని భావించడం జరిగింది. కావున చరిత్రను చూసినచో తెలియునదేమనగా, " బనూ ఖురైజా ద్రోహానికి పాల్పడినట్లు తెలియగానే " అనగా విడిపోయిన విషయం తెలిసిన తరువాత, మోసపూరిత కుట్రను గూర్చి తెలిసినప్పుడు " బనూ ఖురైజాపై ఉన్నటు వంటి నమ్మకం వలన ముస్లిం మహిళలను ఆయా ప్రాంతాల వైపు గల కోటలో దాచడం జరిగింది. పైగా అక్కడ ఎలాంటి రక్షణ ఏర్పాట్లు చేయలేదు. కాని ఇప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని రక్షించడం తప్పనిసరి అని అర్థం చేసుకున్నారు. అందువలన రెండు సైనిక బృంధాలను ఏర్పాటు చేసి వారిని మహిళ ఉన్నటు వంటి కోటకు ఇరువైపుల కాపాల కోసం పంపించారు. మసలలల్మా బిన్ అస్లం రజి గారికి 200ల మంది సైనికులను అప్పగిస్తూ వారిని ఒక చోట నియమించారు. అదే విధముగా జైద్ బిన్ హారిసా రజికు 300ల మంది సైనికులను ఇచ్చి మరొక చోట నియమించారు. ఆపై కొద్ది కొద్ది సమయానికి బిగ్గరగా అల్లాహ్ అక్బర్ అని నినాదాలు చేస్తూ ఉండండి అని ఆదేశించారు. తద్వారా మహిళలు సురక్షితముగా ఉన్నారని అర్థమవుతుంది. ఈ కథనం వలన ఇబ్నే ఇస్‌హాఖ్ ఖందకం యుద్ధంలో 700ల మందియే పాల్గొన్నారని ఎందుకు పేర్కొన్నాడు అనే ప్రశ్నకు సమాధానం దొరికింది. ఎందుకనగా 1200ల మంది సైనికులలో 500ల మంది సైనికులు మహిళల రక్షణ కోసం నియమించినప్పుడు 1200ల మంది ఉన్నటు వంటి సైన్యం కేవలం 700ల మందికే పరిమితమై పోయింది. ఈ విధముగా చరిత్రలో పేర్కొన్నట్లుగా ఖందకం యుద్ధంలో పాల్గొన్న సైనికుల సంఖ్యలో ఉన్నటు వంటి తీవ్రమైన విభేదాల కథనాలు పరిష్కరించబడ్డాయి.

**(దిబాచ తఫ్సీరుల్ ఖుర్‌ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 269-271)**

అన్యారాధులు మదీనాకు చేరుకోవడం మరియు ఆ తరువాత నెలకొన్న పరిస్థితులను గూర్చిన వివరాలు ఇలా ఉన్నాయి. అబూసుఫ్యాన్ నాయకత్వంలో మక్కాకు చెందిన ఖురైష్‌లు మరియు ఇతర తెగలకు చెందిన సమ్మిళిత సైన్యం మదీనాకు చేరుకున్నది. మదీనాకు సమీపంలోనే స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నది. ఆ వివరాలను హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ రజి గారు ఇలా తెలిపారు. "తక్కువలో తక్కువగా 20 రోజులలో మరొక కథనము మేరకు 6 పగలు మరియు 6 రాత్రులలో " రాత్రింభవళ్ళు " నిరంతరం కష్టపడడం వలన సుదీర్ఘమైన ఖందకం త్రవ్వే పని పూర్తి అయినది. అసాధారణమైన కృషి మరియు శ్రమ వలన సహబాలు పూర్తిగా నిస్సహాయులైనారు. ఇటువైపు పని పూర్తి అవడమే ఆలస్యం అటు వైపుగా యూదులు మరియు అరబ్‌కు చెందిన అన్యారాధులు పెద్ద సైన్యాన్ని వెంటతీసుకొని, సంఖ్యాపరంగా, బలం పరంగా విర్రవీగుతూ మదీనా పరిసర ప్రాంతానికి చేరుకున్నారు. ముందుగా అబూ సుఫ్యాన్ ఉహద్ కొండ వైపు బయలుదేరినాడు. కాని అక్కడి ప్రాంతం ఖాళీగా, నిర్మానుష్యముగా ఉండడాన్ని చూసి, మదీనా నగరంపై దాడి చేయుటకు అనువైన ప్రాంతం వైపు బయలు దేరినాడు. కాని ఆ ప్రాంతంలో ఇప్పుడు ఖందకం త్రవ్వడం జరిగింది. అవిశ్వాసుల సైన్యం ఆ ప్రాంతానికి చేరుకొని చూడగా, మదీనాకు మరియు వారి మధ్యలో ఖందకం ఉండడాన్ని చూసి అవాక్కయ్యారు, ఆశ్చర్యపోయారు. అందువలన ఇక ఏమి చేయలేక ఖందకం ముందు ఉన్నటు వంటి ఖాళీ ప్రాంతంలో గుడరాలను ఏర్పాటు చేసుకున్నారు. మరోవైపు అన్యారాధుల సైన్యం వస్తున్న విషయాన్ని తెలుసుకోని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మూడు వేల మంది ముసల్మానులను తమ వెంట తీసుకొని నగరం నుండి బయటికి బయలుదేరినారు. ఆ తరువాత ఖందకం మరియు నగరం మధ్యలో సలఅ కొండకు ముందు భాగంలో తమ గుడరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఖందకం ఎక్కువ వెడల్పుగా లేదు కావున, పైగా కొన్ని చోట్ల బలమైన మరియు తెలివిగల సైనికులు ఆ ప్రాంతాన్ని దూకి నగరంలోకి ప్రవేశించే అవకాశం కనిపించ సాగింది. ఖందకం లేని మదీనాకు చెందిన ఇతర ప్రాంతాలలో కేవలం ఇండ్లు, తోటలు, క్రమబద్ధత లేని మట్టి దిబ్బలు కొంత అడ్డుగా నిలిచి ఉన్నాయి. కావున శత్రువులు ఆ ప్రాంతం నుండి ఇళ్ళపై దాడులు చేయకుండా ఉండడానికి, మరియు ఏదేని మరోక వ్యూహం మేరకు కొద్ది కొద్ది మంది సైనికులను ఆ నగరంలోకి పంపించి నగరంపై దాడి చేయించ కుండా ఉండడానికి ఆ ప్రాంతాన్ని కాపాడుకోవడం కూడ చాలా ముఖ్యం. అందువలన ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సహబాలను వివిధ బృంధాలుగా ఏర్పాటు చేసి ఖందకం యొక్క విభిన్న ప్రాంతాలలో, మదీనాకు చెందిన ఇతర ప్రాంతాలలో అవసరం ఉన్నచోట పర్యవేక్షణ కోసం నియమించారు. అంతేగాకా రాత్రివేళలో గాని, పగటి వేళలో గాని ఈ పర్యవేక్షణలో ఎలాంటి అలసత్వం మరియు నిర్లక్ష్యం వహించకూడదని పదే పదే హెచ్చరించారు. మరోవైపు ఖందకం వలన ఏర్పడిన ఆటంకంతో మైదానంలో యుద్ధం చేయలేక పోవడం లేదా నగరంపై దాడి చేయుటకు అవకాశం లేకపోవడం వలన అవిశ్వాసులు ముట్టడి రూపంలో మదీనా చుట్టు కట్టడి చేశారు. ఆపై బలహీన ఖందకం ప్రాంతాల నుండి ప్రయోజనాన్ని పొందుటకు అవకాశం కోసం ఎదురు చూడసాగారు. "

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స) హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ రజి ఎం.ఏ పేజి 583-584)**

మొత్తానికి శత్రువులు ఖందకాన్ని దాటలేకపోవడం వలన ఇతర వ్యూహాలకు పదును పెట్టారు. ఆయా వివరాలను ఈ విధముగా ఉన్నాయి. అన్యారాధులు మదీనాను నలువైపుల నుండి ముట్టడించారు. అయినా కూడ ఎంత ప్రయత్నించినా వారు ఆ ఖందకాన్ని దాటలేక పోయారు. బహిరంగముగా ముసల్మానులపై దాడి చేయలేక పోయారు. అట్టి నిస్సహాయత మరియు నిరాధారత స్థితిని చూసి అబూ సుఫ్యాన్ మరియు బనూ నజీర్‌కు చెందిన నాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్ వంటి వారు మరొక కుట్రకు పాల్పడినారు. ఆదేమనగా, మదీనాలో ఉన్నటు వంటి బనూ ఖురైజా అనే యూద తెగవారిని ఏదో విధముగా ముసల్మానులతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి సిద్ధం చేయించి, వారిని తమతో కలుపుకున్నచో వారు నగరంలోనే ముసల్మానులపై దాడికి పాల్పడుతారు. కావున వారు ఇట్టి భయంకరమైన కుట్రను ఆచరణలోకి తీసుకరావడానికి హుయ్యి బిన్ అఖ్తబ్ బనూ ఖురైజాకు చెందిన నాయకుడైన కఅబ్ బిన్ అసద్ ఖురజీ వద్దకు వచ్చాడు. హుయ్యా వచ్చిన విషయాన్ని తెలుసుకున్న కఅబ్ వెంటనే కోట యొక్క ద్వారాలను మూసి వేసుకున్నాడు. హుయ్యా లోనికి ప్రవేశించడానికి అనుమతిని కోరాడు. కాని కఅబ్ ద్వారాలను తెరవకుండా తిరస్కరించాడు. హుయ్యా గట్టిగ పిలుస్తూ ఇలా అన్నాడు. ఓ కఅబ్! నీవు నాశనం అవుదువు గాకా! ద్వారాన్ని తెరుము. అందుకు కాఅబ్ ఇలా అన్నాడు. ఓ హుయ్యా! నీవు దుష్టుడవు. నేను ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఒప్పందం చేసుకున్నాను. నేను ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించను. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను నేను ఎల్లప్పుడు సత్యవంతుడిగా, ఒప్పందానికి కట్టుబడి ఉండే వ్యక్తిగానే చూశాను. ఒకవైపు ఇలాంటి మాటలు మాట్లాడినాడు. కాని తరువాత తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. ఆ తరువాత హుయ్యా మరల ఇలా అన్నాడు. ముందుగా ద్వారాలను తెరువుము. నేను నీతో కొన్ని విషయాలు మాట్లాడవలెను. అందుకు కాఅబ్ అల్లాహ్ ప్రమాణం! నేను అలా తెరువను అని అన్నాడు. కాని కొంత సమయం వారి మధ్యలో మాటల పరంపర కొనసాగిన తరువాత చివరికి అతడు ద్వారాన్ని తెరిచాడు. అప్పుడు హుయ్యా ఇలా అన్నాడు. ఓ కఅబ్! నీవు నాశనమై పోవుదువు గాకా!. నేను నీ వద్దకు ఈ కాలపు గౌరవాన్ని మరియు ఉప్పొంగే సముద్రమును తీసుకవచ్చాను. నేను నీ వద్దకు ఖురైష్‌ల నాయకులను మరియు సైన్యాధికారులను తీసుకవచ్చాను. ఆ తరువాత అతడు తాను తీసుకవచ్చిన సైన్యంతో మదీనాను నలువైపుల నుండి ముట్టడి చేశానని చెప్పి, ఆయా అన్ని తెగలను గూర్చి పరిచయం చేశాడు. మరల ఇలా అన్నాడు. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు వారి మిత్రులను నామ రూపాలు లేకుండా చేయనిదే ఇక్కడినుండి వెనుదిరిగి పోమని మేము పరస్పరం శపథం కూడ చేశాము. ఒకవేళ మా మార్గంలో ఈ ఖందకం అడ్డుగా లేనిచో ఆ శపథంలో మేము విజయాన్ని కూడ సాధించేవారము. ఇన్ని మాటలు విన్న తరువాత కూడ బనూ ఖురైజా తెగ నాయకుడు కఅబ్ ఒప్పందాన్ని ఉల్లంఘించడానికి ఏ మాత్రం సుముఖముగా లేకుండెను. అందుకే అతడు ఇలా అన్నాడు. అల్లాహ్ ప్రమాణం! నీవు నా వద్దకు ఈ కాలపు అవమానాన్ని, నీళ్ళు లేని మేఘాలను తీసుక వచ్చావు. ఆ మేఘాలు కేవలం గర్జిస్తాయి, మెరుస్తాయి అంతే. వాటిలో అంతకు మించి ఏమియు లేదు.

ఓ హుయ్యా! నీవు నాశనమైపోవుదువు గాకా!. నన్ను నా స్థితిలోనే వదిలి

వెళ్ళుము. ఎందుకనగా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఎల్లప్పుడు మాటకు కట్టుబడి ఉండేవారిగా, చేసిన వాగ్దానాన్ని నెరవేర్చునట్టి వ్యక్తిగానే నేను చూశాను. పదే పదే ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజాయితి పరులు, వాగ్దానాన్ని నెరవేర్చువారు అని గుర్తు చేస్తున్నాడు. వారు మాపై ఎలాంటి ఒత్తిడిని తీసుక రాలేదు, మా ధర్మం విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోలేదు. మాకు చాలా మంచి పొరుగు వారిగా ఉన్నారు. కావున నీవు వెళ్ళిపోమ్ము. లేనిచో మా కంటే ముందు మీ వారికి పట్టిన గతియో మాకు పట్టవచ్చును.

కాని హుయ్యా కఅబ్‌ను బుట్టలో వేసుకోవడానికి ప్రయత్నిస్తునే ఉన్నాడు. తన దారిలోకి తీసుకవరావడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇందుకోసం అతడు తన తెగ వారి మరియు బనూ ఖైనుఖా వారి బాధలను , కష్టాలను గూర్చి చెప్పడం ప్రారంభించాడు. అంతేగాకా ఈ కష్టాలన్ని ఈ ముసల్మానుల వలనే కల్గుతున్నాయి అని చెప్పాడు. అలా అతడు కఅబ్ మనస్సును మొత్తపర్యడంలో విజయాన్ని సాధించాడు. చివరికి కఅబ్ కూడ అతని మాటలకు పడిపోయాడు. ఒప్పంద ఉల్లంఘించే అతని స్వాభావికత అతనిపై ఆధిక్యతను సాధించింది. ఈ క్రమంలోనే అతడు హుయ్యాతో ఇలా అన్నాడు. అలాగైనచో మంచిది, ఒకవేళ నేను మీ మాటను విన్నచో, ఒకవేళ ఖురైష్‌లు, ఘత్ఫాన్‌లు వెనుదిరిగి పోయినచో, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను హత మార్చనిచో, అప్పుడు మా పరిస్థితి ఏమిటి? అని అడిగాడు. అందుకు హుయ్యా " ఈ విషయంలో నీవు ఏ మాత్రం చింతించకుము!. అలాంటి పరిస్థితియే వచ్చినచో నేను మీతో పాటు మీ కోటలోకి ప్రవేశిస్తాను. అప్పుడు నీకు కలిగే కష్టమే నాకు కూడ కల్గుతుంది" అని అన్నాడు.

ఇలా మాటల పర్వం కొనసాగిన తరువాత చిరవకి కఅబ్ బిన్ అసద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో చేసిన ఒప్పందాన్ని ఉల్లంఘించాడు. ఆ సమయంలో కఅబ్ మిత్రుడు అమర్ బిన్ సుఅదా అతనికి నచ్చజెప్పాడు, వారించాడు. అతడు చేస్తున్న తప్పుడు పని పరిణామాలను గూర్చి హెచ్చరించాడు. అతనికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో చేసుకున్న పటిష్టమైన ఒప్పందాన్ని గుర్తుచేశాడు. ఆపై మరల ఇలా అన్నాడు. ఒకవేళ నీవు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు సహాయం చేయకూడదని నిశ్చయించుకున్నచో నీవు వారికి సహాయం చేయకుము. వారిని వారిని శత్రువులను వారికే వదిలి వేయుము. అంతేగాని ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ వారి శత్రువులకు సహాయం చేయకుము అని నచ్చజెప్పాడు. కాని అతడు ఆ మాటలను పట్టించుకోలేదు.

ఈ పరిస్థితిని చూసి బనూ ఖురైజాకు చెందిన కొందరు సహృదయులైన యూదులు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికిచేరుకోని ఇస్లాంను స్వీకరించారు.

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ రజికు బనూ ఖురైజా తెగవారు ఒప్పందాన్ని ఉల్లంఘిచారనే వార్త అందగానే వారు ఆ విషయాన్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియజేశారు. అప్పుడు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సఅబ్ బిన్ ముఆజ్ రజి మరియు సఅద్ బిన్ ఉబాదహ్ రజిలను పంపించారు. వీరు ఇరువురు కూడ తమ తెగల నాయకులు. అదే విధముగా వారి ఇరువురికి తోడుగా అబ్దుల్లాహ్ బిన్ రవాహా రజి మరియు ఖవ్వాతు బిన్ జుబైర్ రజిలను కూడ పంపారు. మరొక కథనము ప్రకారం వారికి తోడుగా ఉసయ్యద్ బిన్ హుజైర్ రజిను కూడ పంపినట్లు గలదు. వారితో ఇలా అన్నారు. నాకు ఆ తెగను గూర్చి అందిన వార్తను గురించి మీరు వెళ్ళి అది ఎంత వరకు నిజమో, కాదో తెలుసుకోని చెప్పండి. ఒకవేళ ఈ వార్త నిజమే అయినచో అందరి ముందు నాకు ఆ విషయాన్ని తెలియ జేయకండి. అది నిజమే అని అర్థమయ్యేలా నాకు సూచన ప్రాయంగా తెలియ జేయండి. ఒకవేళ వారు ఒప్పందానికి కట్టుబడి ఉన్నచో, ఆ వార్త అసత్యమైనచో బహిరంగముగానే ఆ విషయాన్ని నాకు తెలియజేయండి. మొత్తానికి ఈ బృంధం బనూ ఖురైజా వద్దకు చేరుకున్నది. అక్కడ కఅబ్ మరియు అతని మిత్రులతో సంభాషించగా వారి చూపులు, వ్యవహారాలు మారినట్లుగా కనిపించాయి. అందుకు మీరు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఒప్పందం చేసుకున్నారు కదా! అని కఅబ్‌కు గుర్తు చేయగా, అతడు ఎంతో గర్వముగా ఏ ప్రవక్త?, ఎలాంటి ఒప్పందం? మేము ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు పోండి, బూటుకు ఉన్నటు వంటి నాడను తెంపినట్లుగానే నేను ఆ ఒప్పందాన్ని తెంపివేశాను అని సమాధానం ఇచ్చాడు. కథనాల ప్రకారంగా చూసినచో ఆ సమయంలో ప్రత్యర్థుల నుండి కఠినమైన పదజాలం కూడ వెలువడినట్లు తెలుస్తుంది. మొత్తానికి ఈ బృంధం వెనుదిరిగి వచ్చింది. సూచన ప్రాయంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు జరిగిన దంతయు వివరముగా తెలియజేశారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులలో, స్పృహను కోల్పోయే పరిస్థితులలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కొంత సమయం మౌనంగా ఉన్నారు. ఆ తరువాత ఇలా అన్నారు. హుజూర్ పై ఎలాంటి ప్రభావం చూపలేదు. సాధారణ వ్యక్తి అయితే వెన్నుముక విరిగిపడేది. హుజూర్ (స) ఇలా అన్నారు:

**అబ్‌షిరూ యా మఅషరల్ మూమినీన బినస్‌రిల్లాహి తాలా వ అవ్‌నిహీ.**

ఓ విశ్వాసుల సమాజమా! అల్లాహ్ తాలా యొక్క సహాయ, సహకారాలు అందుకోబోవుచున్నందుకు సంతోషించండి.

మరల ఇలా తెలిపారు. ఒకానొక సమయంలో నేను ఖాన కాబా చుట్టూ ప్రదక్షణలు చేస్తుంటాను. దాని తాళం చెవులు నా చేతికి అందించబడును. ఖైసర్ మరియు కిస్రాలు నాశనమైపోతారు. వారి సంపద మొత్తం అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయబడుతుందనే విషయాన్ని నేను బలంగా నమ్ముతున్నాను.

**(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 4, పేజి 373-374, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బైహూత్)**

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ రజి గారు బనూ ఖురైజా చేసిన ద్రోహాన్ని గూర్చి వివరిస్తూ ఇలా తెలిపారు: " అబూ సుఫ్యాన్ ఈ సందర్భములో ఒక ఎత్తువేశాడు. అదేమనగా బనూ నజీర్ తెగకు చెందిన నాయకుడు హుయ్యా బిన్ అఖ్తబ్‌తో ' నీవు రాత్రి వేళ కటిక చీకటిలో ముసుగు కప్పుకోని బనూ ఖురైజా కోట వైపు వెళ్ళుము. వారి నాయకుడైన కఅబ్ బిన్ అసద్‌తో మాట్లాడి బనూ ఖురైజాను తమతో కలుపుకోవడానికి ప్రయత్నించుము. ' అని కుట్రపూరిత సలహా ఇచ్చాడు. కావున హుయ్యా బిన్ అఖ్తబ్ అవకాశంను చూసుకోని కఅబ్ ఇంటికి చేరుకున్నాడు. మొదట్లో కఅబ్ అతని మాటల వినడానికి ఇష్టపడలేదు. పైగా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)తో మేము ఒప్పందాలు, వాగ్దానాలు చేసుకున్నాము. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎల్లప్పుడు ఒప్పందాలకు, వాగ్దానాలకు కట్టుబడి ఉండడాన్ని మేము చూశాము. కావున మేము వారికి ద్రోహం చేయలేము అని ఖచ్చితముగా చెప్పారు. కాని హుయ్యా అరచేతిలో స్వర్గంను చూపించినట్లుగా చేయడంతో అనగా అతి త్వరలోనే ఇస్లాం అంతమైపోతుందని, ఇస్లాంను అంతం చేయనిచో తాము మదీనాను విడిచి వెళ్ళిపోమని, నమ్మకం కల్గించేలా మాట్లడడం వలన చివరికి అతడు వారితో కలిసిపోయాడు. ఈ విధముగా బనూ ఖురైజాకు చెందిన బలం కూడ ముందు నుండి బరువుగా ఉండి క్రిందికి వంగిన పళ్ళెంలోకే చేరిపడింది. " అనగా అవిశ్వాసుల సంఖ్య ముందు నుండే చాలా అధికముగా ఉన్నది. పైగా ఈ యూద తెగవారు ఒప్పందాన్ని ఉల్లఘింస్తూ వారిలో చేరిపోయారు. " ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు బనూ ఖురైజా చేసిన భయంకరమైన ద్రోహాన్ని గూర్చి తెలియగానే హుజూర్ (స) ముందు రెండు, మూడు సార్లు రహస్యముగా జుబైర్ బిన్ అవామ్ రజిను వాస్తవ పరిస్థితులను తెలుసుకోని రమ్మని పంపించారు. ఆ తరువాత ఔస్ మరియు ఖజ్‌రజ్ తెగలకు చెందిన నాయకులైన సఅద్ బిన్ ముఆజ్ రజి మరియు సఅద్ బిన్ ఉబాదహ్ రజిలతో పాటు మరి కొంత మంది ప్రభావశీలురైన అనుచరులను ఒక బృంధంగా ఏర్పాటు చేసి బనూ ఖురైజా తెగ వారి వైపు పంపించారు. అంతేగాకా ఒకవేళ పరిస్థితులు భయంకరముగా ఉన్నచో మీరు తిరిగి వచ్చిన తరువాత వాటిని గూర్చి బహిరంగముగా కాకుండా , నేను అర్థం చేసుకునే విధముగా సూచన ప్రాయంగా తెలియజేయండి. తద్వారా ప్రజలు కూడ ఆందోళనలకు గురికారు అని చెప్పారు. ఈ బృంధం బనూ ఖురైజా తెగ వారి వద్దకు వెళ్ళి ఒప్పందను గూర్చి ప్రస్తావించగా, ఆ తెగవారు రెచ్చిపోతూ ఇలా అన్నారు. " వెళ్ళిపోండి, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు మా మధ్య ఎలాంటి ఒప్పందాలు, వాగ్దానాలు లేవు. " ఈ పదాలను విన్న తరువాత అనుచరులు బృంధం అక్కడి నుండి బయలుదేరి వచ్చారు. సఅద్ బిన్ ముఆజ్ రజి మరియు సఅద్ బిన్ ఉబాదహ్ రజిలు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిదికి చేరుకోని సమయస్ఫూర్తితో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు పరిస్థితులను గూర్చి తెలియజేశారు. " **(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స), హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ రజి పేజి 584-585)**

కొన్ని సందర్భాలలో మన నవ యువకులు కూడ ఇతరుల మాటలు విని ఆ సమయంలో బనూ ఖురైజాపై ఎందుకు దౌర్జన్యం చేశారు? అని ప్రశ్నిస్తుంటారు. నిజానికి వారు ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అందుకే వారిని శిక్షించడం జరిగింది. అంతేగాని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విధించిన శిక్ష దౌర్జన్యం అనబడదు. మొత్తానికి ఈ యుద్ధానికి చెందిన మరికొన్ని వివరాలు ఉన్నాయి. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి కూడ ఎంతో వివరముగా తెలియజేశారు. ఇన్షా అల్లాహ్ వాటిని తరువాత ప్రస్తావించుతాను.

ఈ రోజు నుండి ఖుద్దాముల్ అహ్మద్ యు.కే యొక్క వార్షిక సమావేశం ప్రారంభ మవుతున్నది. యువకులు ఈ సమావేశాల నుండి పూర్తి స్థాయిలో ప్రయోజనాలను పొందడానికి ప్రయత్నించాలి. బహుశ వర్షం కురవవచ్చునని వాతవరణ శాఖ తెల్పింది. ఏది ఏమైన మొత్తానికి అల్లాహ్ తాలా అనుగ్రహించుగాకా!. ప్రశాంతంగా ఈ కార్యక్రమాలన్నియు పూర్తి అగును గాకా!. ఈ రోజులలో యువకులు ఆధ్యాత్మిక మరియు విజ్ఞాన పరమైన ప్రామాణికాలను పెంచుకోవడానికి ప్రయత్నించాలి. నేను ముందుగా సూచించిన మేరకు ఆయా దుఆలను, దరూద్‌లను పఠిస్తూ ఉండాలి. ప్రత్యేకించి ఈ రోజులలో వీటివైపు చాలా శ్రద్ధను చూపండి. అల్లాహ్ తాలా అన్ని విధాల షైతాన్ దాడుల నుండి ప్రతి ఒక్కరిని కాపాడుగాకా!.

ఇప్పుడు నేను కొన్ని పరోక్ష జనాజ నమాజ్‌లను చదివిస్తాను. ముందు వారిని గూర్చి తెల్పుతాను. మొదటి ప్రస్తావన గౌ॥ హబీబుర్రహ్మాన్ జీర్వీ గారిది. వీరు రబ్వాకు చెందినవారు. కొన్ని రోజుల క్రితం 73 సంవత్సరాల వయస్సులో వీరు మృతి చెందారు. **ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్.** అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వీరు వసియ్యత్ చేశారు. పైగా జీవిత సమర్పితులు. వీరి తండ్రి

గారి పేరు సూఫి ఖుదా బక్ష్ జీర్వీ. వీరి వంశంలోకి అహ్మదియ్యత్ వీరి తండ్రిగారైన సూఫీ ఖుదా బక్ష్ గారి ద్వారా వచ్చింది. వారు 1928లో హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్హు గారి చేతిపై బైఅత్ చేయు భాగ్యమును పొందారు. హబీబుర్రహ్మాన్ జీర్వీ గారు ప్రాథమిక విద్యాభ్యాసం రబ్వాలోనే పూర్తి చేశారు. ఆ తరువాత పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి లైబ్రేరి సైన్స్‌లో ఎం.ఎస్.సి చేశారు. 1981లో వీరు తమ జీవితాన్ని అంకితం చేశారు. ఆ సంవత్సరమే వారి అంకితము స్వీకరించబడింది. 1981లో వీరిని అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా నియమించడం జరిగింది. 3, 4 సంవత్సరాల పాటు ఇంచార్జ్ ఖిలాఫత్ లైబ్రేరియన్‌గా కూడ సేవలందించారు. ఆ తరువాత వారిని నజారత్ ఇషాఅత్‌లో నియమించారు. ఆ తరువాత తాహిర్ ఫౌండేషన్‌లో నియమాకం జరిగింది. ప్రస్తుతం వీరు నాయబ్ నాజిర్ దీవాన్ సదర్ అంజుమన్ అహ్మదియ్యాగా సేవలందిస్తున్నారు. ఖుద్దాముల్ అహ్మదియ్యలో కూడ వీరు ఆర్థిక కార్యదర్శిగా సేవలందించు భాగ్యాన్ని పొందారు. అన్సారుల్లాహ్‌లో కూడ కేంద్రీయ కార్యదర్శిగా సేవలందించు భాగ్యాన్ని పొందారు. వీరు ఎంతో కృషితో హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి తెల్పినట్లుగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి జీవితంను గూర్చిన అంశాలను అనేక పుస్తకాల నుండి సేకరించి వాటి అన్నింటిని ఒకచోట కూర్పునిచ్చి పుస్తకాన్ని రూపొందించగా, దానిని "తజ్‌కారే మహ్దీ " పేరుతో ప్రచురించడం జరిగింది. అంతేగాకుండా అనేక శీర్షికల కోసం వీరు చాలా సేవలందించారు. వాటిలో కొన్ని వివిధ దశలలో ఉన్నాయి. అల్లాహ్ తాలా వారికి ఒక కుమారుడు మరియు ఇద్దరు కుమార్తేలను అనుగ్రహించాడు. ఖిలాఫత్‌తో చాలా పటిష్టమైన అనుబంధం ఉండేది. ఎంతో నిశబ్ధ స్వభావం కల్గినవారు, తమ పని పట్లనే ఎక్కువ శ్రద్దను చూపించేవారు. వీరికి ఏ పనిని అప్పగించినా కూడ దానిని ఎంతో బాధ్యతతో నెరవేర్చేవారు. ఎల్లప్పుడు అంకిత స్పూర్తిని నెరవేర్చేవారు. ఆసక్తితో పని చేసేవారు. కలవిడిగా ఉండేవారు. ఎల్లప్పుడు సంతోషంగా ఉండేవారు. అల్లాహ్ తాలా వీరిని కరుణించుగాకా!, తన అనుగ్రహంతో కప్పిపుచ్చును గాకా!. వీరి పిల్లలకు వీరి సత్కార్యములను కొనసాగించు భాగ్యమును ప్రసాదించుగాకా!.

రెండవ ప్రస్తావన డాక్టర్ సయ్యద్ రియాజుల్ హసన్ సాహెబ్ గారిది. వీరు కూడ కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వీరు కూడ వసియ్యత్ చేశారు. వీరు బ్రిగేడియర్ డాక్టర్ జియాఉల్ హసన్ గారి కుమారులు. మృతుడు జీవితాన్ని అంకితం చేశాడు. ఒక డాక్టర్‌గా జమాఅత్‌కు సేవలందిస్తూ ఉన్నారు. బాల్యం నుండే వీరు జమాఅత్‌కు సేవలందిస్తు వచ్చారు. నుస్రత్ జహాం పథకంలో భాగంగా సుమారు 20 సంవత్సరాలకు పైబడి యుగాండా, కెన్యా, గేంబియా, పాకిస్తాన్ వంటి దేశాలలో పూర్తి స్థాయిలో సేవలంధించు భాగ్యను పొందారు. కెన్యాలో చాలా సంవత్సరాలుగా సేవలందించిన తరువాత వారు స్పెషలైజేషన్ మరియు జనరల్ సర్జన్ ట్రేనింగ్ కొరకు అనుమతిని కోరారు. ఆ తరువాత అక్కడి నుండి వారు పాకిస్తాన్‌కు వెళ్ళిపోయారు. ఎన్నో మెడికల్ డిప్లోమా మరియు సర్టిఫికెట్స్‌ను సాధించారు. మృతుడు మెడికల్ విశ్వవిద్యాలయంలో డాక్టర్‌లకు అనాటోమీ సబ్జెక్ట్‌ను బోధించు భాగ్యమును కూడ పొందారు. ఎంతో గొప్ప యోధుడైన డాక్టర్. గేంబియాకు చెందిన స్థానిక విద్యార్థులకు ఆర్థిక చేయుటను అందించేవారు. ఆ విద్యార్థుల పై చదువులకు స్పాన్సర్ చేసేవారు. పని కోసం అన్వేషించే వారికి సహాయం అందించేవారు. పేదలకు, అవసరం ఉన్నటు వంటి వ్యక్తులకు ఆర్థిక సహాయంను అందించుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండేవారు. వారిలో ఉన్నటు వంటి అతి ప్రధానమైన ప్రత్యేకత ఏమిటనగా వారు అధికముగా దుఆలు చేసేవారు. తహజ్జుద్ నమాజ్ సల్పేవారు. వీరు యుక్త వయస్సులో నుండే తహజ్జుద్ నమాజ్ చేయడం అలవర్చుకున్నారు. వీరిని గూర్చి తెలిసిన వారు కూడ వీరి విశిష్టతలను వ్రాసి పంపుతున్నారు. చాలా కలుపుగోలు గల వ్యక్తిత్వం గలవారు, రోగులతో పట్ల నిజమైన కరుణ, సానుభూతి, ప్రేమను చూపించేవారు. శ్రమజీవి, ఉత్సాహవంతులు, అల్లాహ్‌పై పూర్తి నమ్మకాన్ని కల్గిన వ్యక్తితం గలవారు. దుఆలు చేసేవారు, ప్రజల పట్ల దయాగుణం గలవారు, వీరి స్వభావంలో వినయం, వినమ్రత, విధేయతలు మరియు అపారమైన సేవా దృక్పథం ఉండేవి. చాలా మంచి సుగుణాలు గలవారు, జీవిత సమర్పితులను గౌరవించేవారు. అల్లాహ్ తాలా మృతున్ని కరుణించుగాకా!, తన అనుగ్రహంతో కప్పిపుచ్చును గాకా!.

మూడవ ప్రస్తావన గౌ॥ డాక్టర్ ప్రోఫేసర్ అబ్దుల్ జలీల్ సాధిఖ్ సాహెబ్ రబ్వా గారిది. వీరు కొన్ని రోజుల క్రితం 80 సంవత్సరాల వయస్సులో మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. వీరు అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వసియ్యత్ చేశారు. ఖురైష్ అబ్దుల్ ఘని సాహెబ్ రబ్వా గారి కుమారులు. వీరి వంశంలో అహ్మదియ్యత్ వీరి (మృతుడి) తాతగారైన (తండ్రిగారి తండ్రి) హజ్రత్ మియా ఖుతుబొద్దీన్ సాహెబ్ ఆఫ్ గోలీకి జిల్లా, గుజరాత్ (రాష్ట్ర వాస్తవ్యులు మరియు వీరి తాత గారైన (తల్లి గారి తండ్రి) హజ్రత్ మౌల్వీ ముహమ్మద్ ఉస్మాన్ సాహెబ్ అమీర్ జమాఅత్ ఢేరా గాజి ఖాన్ సాహెబ్ గార్ల ద్వారా వచ్చింది. జలీల్ సాధిఖ్ గారు పొలిటికల్ సైన్స్‌లో ఎం.ఏ చేశారు. ఆ తరువాత 1964లో తాలీముల్ ఇస్లాం కళాశాలలో లెక్చరర్‌గా నియమించబడ్డారు. ఆ తరువాత 1966లో వీరు ఆంగ్లభాషలో ఎం.ఏ చేశారు. ఆ తరువాత వీరిని తాలీముల్ ఇస్లాం కళాశాలలో ఆంగ్ల శాఖలో శాశ్విత లెక్చరర్‌గా నియమించారు. పూర్తి 39 సంవత్సరాలు బోధనా సేవలోనే నిమగ్నమైపోయారు. నేను కూడ కళాశాలలో వీరి విద్యార్థుడిని. ఎంతో మౌనంగా, ఎంతో ప్రేమగా బోధించే లెక్చరర్ వీరు. తమ విద్యార్థులతో మంచి అనుబంధాన్ని కల్గియుండేవారు. విధ్యార్థులను గౌరవించేవారు. పదవి విరమణ తరువాత 2003లో వీరు జీవితాన్ని అంకితం చేశారు. వీరిని సదర్ సదర్ అంజుమన్ అహ్మదియ్యలోని శిక్షణా, మరియు రికార్డు పొందుపర్చు శాఖకు ఇంచార్జ్‌గా అనగా నాయిబ్ నాజిర్ స్థాయిలో నియమితులైనారు. మజ్లిస్ ఖుద్దాముల్ అహ్మదియ్యలో అనేక శాఖలలో అనేక కార్యదర్శులుగా సేవలందించు భాగ్యమును పొందారు. వీరు ఆరోగ్య శాఖ ప్రతినిధి పాకిస్తాన్‌గా కూడ సేవలందించారు. 1983 నుండి పాకిస్తాన్‌లో ప్రధాన కేంద్ర ఖజా కార్యాలయంలో ఖాజిగా సేవలందించారు. తమ ప్రాంతానికి సదర్‌గా కూడ నియమితులైనారు. వీరికి ఇద్దరు కుమార్తేలు, ఒక కుమారుడు. వీరిని గూర్చి తెలిసినవారు ఇలా వ్రాసారు. వారు నిజాన్ని వ్రాసారు. చాలా పరిశుభ్రత కల్గినవారు, సాధారణ మనస్థత్వం కల్గినవారు, ఎల్లప్పుడు మౌనంగా ఉండడాన్ని ఇష్టపడేవారు. కాని మాట్లాడినప్పుడు మాత్రం తప్పకుండా నిజాన్ని మాట్లాడేవారు. మాటలను కొలిసినట్లుగా, తూకం వేసినట్లుగా, తెలుసుకోని మాట్లాడేవారు. వ్యక్తిత్వం పరంగా ఎలాంటి మచ్చలేని వారు, సున్నితత్వం గలవారు, ఇతరుల పనులలో అనవసరంగా తలదూర్చేవారు కాదు, అవసరం ఉన్నచోట తప్పకుండా మంచి సలహాను ఇచ్చేవారు. మంచి పనులు చేసేవారిని ప్రోత్సహించేవారు. ఎవరైన బాధించినచో ఎవరికి ఫిర్యాదు చేసేవారు కాదు, ఎంతో సహనశీలురు, కృతజ్ఞతభావం గలవారు, పొదుపును పాటించు వ్యక్తిత్వం గలవారు. అవసరం ఉన్నవారికి చాటుగా, మౌనంగా ఆర్థిక సహాయం చేసేవారు. ఖిలాఫత్‌తో చాలా పటిష్ట అనుబంధం గలవారు, వీరు క్రమం తప్పకుండా లేఖలు వ్రాసేవారు. వారి కుటుంబ సభ్యుల మధ్య కూడ చాలా ఆహ్లాదకరమైన వాతవరణం ఉండేది. ఇంట్లో భార్యకు సహాయం మరియు తల్లి దండ్రులు సేవలు చేసేవారు. వారి హక్కులను చెల్లించేవారు. వారి సోదరుడు ఇలా వ్రాసాడు. సోదర, సోదరీమణుల మంచి చెడులను చాలా బాగా చూసుకునేవారు. తన బాధ్యతగా భావించి వారికి సేవలందించేవారు.

తదుపరి ప్రస్తావన గౌ॥ మాస్టర్ మునీర్ అహ్మద్ సాహెబ్ జంగ్ గారిది. వీరు కొన్ని రోజుల క్రితం 82 సంవత్సరాల వయస్సులో మృతి చెందారు. **ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.** వీరు కూడ అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వసియ్యత్ చేశారు. వీరి తండ్రిగారైన మియాం గులాం ముహమ్మద్ సాహెబ్ గారు 1930లో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి యల్లాహు తాలా అన్హు గారి బైఅత్ చేశారు. మాస్టర్ గారు జన్మత: అహ్మదీయులు. ఖుద్దాముల్ అహ్మదియ్య, అన్సారుల్ అహ్మదియ్యలో కలిపి వీరికి 40 సంవత్సరాల పాటు సేవ చేయు భాగ్యం లభించింది. జిల్లా ఖాయిద్‌గా సేవలందించారు. ఆ తరువాత చిన్యూట్‌ను జిల్లాగా ప్రకటించిన తరువాత అక్కడ కూడ వీరు నాజింగా సేవలందించారు. ఎంతో స్వచ్ఛత మరియు అంకిత భావం గల ధార్మిక సేవకులు. ప్రజలకు ప్రయోజనంను చేకూర్చువారు. జంగ్‌లో ప్రైమరీ ఉపాధ్యాయుడిగా సేవలందించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళుటకు, వీరు ప్రజలకు మరియు ప్రత్యేకించి అహ్మదీయులకు సహాయంను అందించేవారు. కేవలం సహాయంను అందించడమే కాకుండా వారి పనులను కూడ చేసిపెట్టేవారు, పైగా తమ ఇంటికి వచ్చిన అతిథులకు ఆతిథ్య మర్యాదలు చేసేవారు. ప్రజా సంబంధాల పరిధి చాలా విశృతముగా ఉండేది. ఆయా సంబంధాలను జమాఅత్ కొరకు, జమాఅత్ సభ్యుల ప్రయోజనాల కోసం ఉపయోగించేవారు. అంతేగాని స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకునేవారు కాదు. ఖైదీలు జమాఅత్ వారైన, జమాఅత్‌యేతరులైన వారి అభ్యున్నతి కోసం కృషి చేసేవారు. జైలు అధికారులతో వీరికి సత్సంబంధాలు ఉండేవి. అందువలన వీరు జమాఅత్ ఖైదీలకు జైలులో సౌకర్యాలు కల్పించేందుకు చాలా కృషి చేసేవారు. ఖైదీల ఆత్మస్థైర్యాన్ని పెంచడానికి కృషి చేసేవారు. మేము అనగా నేను మరియు నా మిత్రులు జైలుకు వెళ్ళినప్పుడు ఆ సమయంలో వీరు మాకు చాలా సేవ చేశారు. జైలర్‌తో వ్యక్తి గత పరిచయం ఉండడం వలన కొన్ని ప్రత్యేక సౌకర్యాలను కూడ కల్పించడంలో సహాయం చేశారు. సాధారణ ఖైదీలకు అలాంటి సౌకర్యాలు కల్పించబడవు. అల్లాహ్ తాలా దయతో పేద అహ్మదీయులైన, సంపన్న అహ్మదీయులైన అందరికి సేవ చేయుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండేవారు కాని కొంత మంది ప్రత్యేక వ్యక్తుల వరకే పరిమితం అయ్యేవారు కాదు. సాధారణముగా కూడ ఖైదీల ఆత్మస్థైర్యం పెంపొందించడం కోసం కృషి చేసేవారు. ఖాదియాన్ పట్ల వీరికి అమితమైన ప్రేమాభిమానాలు ఉండేవి. సుమారు ప్రతి సంవత్సరం ఖాదియాన్‌కు వెళ్ళేవారు. అక్కడ ద్యూటీలను కూడ చేసేవారు. కేంద్రీయ ప్రతినిధులు వారి జిల్లా పర్యటకు వెళ్ళినచో అక్కడ కూడ వారికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలను అందించేవారు. కరపత్రులను పంచి పెట్టినందున వీరిపై 1988లో ఒక కేసును నమోదు చేశారు. కాని తరువాత ఆ కేసు కొట్టివేయబడింది. అల్లాహ్ తాలా వీరిని కరుణించుగాకా!, మన్నించుగాకా!, వీరి స్థాయిని అంతస్థులను పెంచుగాకా!, వీరి వారసులకు వీరి సత్కార్యములను కొనసాగించు భాగ్యమును ప్రసాదించుగాకా!.

**(అల్ ఫజల్ ఇంటర్నేషనల్ 11 అక్టోబర్ 2024, పేజి 2-6).**

# జుమా ప్రసంగము

సాధారణముగా ముసల్మానులు శత్రువులను బాణాల ద్వారా ఎదుర్కొనేవారు. అందువలన కొన్ని సందర్భాలలో శత్రువుల ఒక బృంధం ముసల్మానులపై వరుసగా బాణాలు విసురుతూ ముసల్మానులను వెనుకకు జరిగేలా చేసేవారు. అదే సమయంలో శత్రువుల మరొక బృంధం బలహీన ఖందక ప్రాంతంను ఎంచుకొని దానిని దాటుకుంటూ నగరంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించేవారు. ఇలాంటి యుద్ధం ఉదయం నుండి సాయంత్రం వరకు కొన్నిసార్లు అయితే రాత్రి వేళ వరకు కూడ కొనసాగుతూ ఉండేది.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ప్రాణాలర్పించు అనుచరులకు హుజూర్ (స) పట్ల ఉన్న ప్రేమాభిమానాలు ఎంత అద్భుతమయమో, ఎంతగా వారు తమను తాము సమర్పించుకుంటున్నారో చూడండి!.

మరోవైపు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను చూడండి. తమపై అనుచరులకు ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఎంతటి వీరత్వం అనగా, హుజూర్ (స)కు తమ ప్రాణాలను గూర్చి ఏ మాత్రం చింతనే లేదు. మదీనా వాసుల కోసం మాత్రమే చింతన ఉన్నది. అందు కోసమే ఎక్కువ శాతం హుజూర్ (స) స్వయముగా వివిధ ప్రాంతాలలో కాపలా ఉండే వారు.

ఎప్పుడైన విశ్రాంతి తీసుకోవడానికి తమ శిభిరానికి వెళ్ళినచో అప్పుడు కూడ ఎక్కువ సమయం అల్లాహ్ తాలా సన్నిధిలోనే సాష్టాంగం చేస్తుండేవారు. దుఆలు చేస్తూ కనిపించేవారు.

ఈ వారంలో ఈ రోజు నుండే లజ్నా మరియు అన్సారులా వార్షిక సమావేశాలు ప్రారంభమవుచున్నాయి. నేను ముందుగా యువకులకు తెల్పినట్లుగా, ఈ ఇరువురికి కూడ అనగా లజ్నాకు మరియు అన్సారులకు కూడ తెల్పునదేమనగా, ఈ రోజులను ప్రత్యేకించి దుఆలో గడపగలరు. దరూద్‌లను చదువుటకు ఎక్కువగా ప్రయత్నించగలరు.

అల్లాహ్ తాలా మీ అందరికి ఇట్టి భాగ్యమును కల్గించుగాకా!. ఇజ్తిమాల ఉద్దేశాలను నెరవేర్చుటకు ప్రయత్నించుదురు గాకా! అంతేగాని వినోదంను పంచే కార్యక్రమాలలో పాల్గొనడం, లేదా అనవసర విషయాలతో సమయం వృధా చేయడం వంటివి చేయకూడదు. అల్లాహ్ తాలా అన్ని విధాలుగా ఈ సమావేశలను శుభ ప్రదం చేయుగాకా!.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 27 సెప్టెంబర్ 2024, ( 27 తబూఖ్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ
أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

అహజాబ్ యుద్ధంలో నెలకొన్న పరిస్థితులను గూర్చి హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు గారు కూడ వివరముగా ప్రస్తావించారని నేను గత జుమా ప్రసంగంలో తెలిపాను. ఆ వివరాలను ఇప్పుడు నేను మీ ముందు ప్రస్తావించుతాను. “ మదీనా నగరం అధిక భాగం ఖందకం వలన సురక్షితముగా ఉన్నది. మరోవైపు కొన్ని కొండచర్యలు, పటిష్టమైన భవనాలు, ధట్టమైన తోటలు ఉన్నాయి. కావున ఆ వైపు నుండి శత్రువులు ఒక్కసారిగా దాడి చేయలేరు. అందువలన వారు పరస్పరం సంప్రదింపులు జరుపుకున్న తరువాత ” అనగా అవిశ్వాసులు “ మదీనాలో ఉన్నటు వంటి మూడవ యూద తెగ, దాని పేరు బనూ ఖురైజా వారిని ఏదో ఒక విధముగా తమతో కలుపుకున్నచో, వారి ద్వారా మనకు మదీనాలోకి చేరుకునే మార్గం లభిస్తుంది అనే ఒక నిర్ణయానికి వచ్చారు. కావున ఆ నిర్ణయం ప్రకారం బహిష్కరించబడిన బనూ నజీర్ తెగ నాయకుడైన హుయ్యా బిన్ అఖ్తబ్‌కు, అతడు రెచ్చగొట్టడం వలనే ఈ అరబ్బులందరు ఒకటై మదీనాపై దాడి చేయుటకు వచ్చారు. అవిశ్వాసుల సైన్యాధిపతి అయినా అబూ సుఫ్యాన్ అతనితో నీవు ఏ విధముగానైన బనూ ఖురైజాను తమతో కలుపే ప్రయత్నం చేయుమని బాధ్యతను అప్పగించాడు. అందువలన హుయ్యా బిన్ అఖ్తబ్ యూదుల కోటల వైపు వెళ్ళాడు. అక్కడి నుండి అతడు బనూ ఖురైజా తెగకు చెందిన నాయకుడిని కలుసుకోవడానికి ప్రయత్నించాడు. అందుకు అతడు ముందుగా కలుసుకోవడానికి తిరస్కరించాడు. కాని హుయ్యా అతనితో ఇప్పుడు అరబ్బులందరు ముసల్మానులను అంతం చేయడానికి వచ్చారు, ఈ నగర వాసులు ఏ విధముగాను అరబ్బులందరిని ఎదురించదు. ప్రస్తుతం ముసల్మానుల ముందు ఉన్నటు వంటి సైన్యాన్ని కేవలం ఒక సైన్యంగా మాత్రమే భావించకండి. అది ఒక ఎగిసిపడుతున్న సముద్రం వంటిది అని నచ్చజెప్పి బనూ ఖురైజా వారిని అతడు ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడునట్లుగా, వాగ్దాన భంగానికి పాల్పడునట్లుగా సిద్ధం చేశాడు. ఆపై ముందే రచించుకున్న పథకమును అతనికి తెలిపాడు. అదేమనగా ఇప్పుడు అవిశ్వాసుల సైన్యం ఖందకాన్ని దాటడానికి ప్రయత్నిస్తుంది, కావున ఆ సైన్యం ఖందకాన్ని దాటడంలో విజయం సాధించగానే, బనూ ఖురైజాపై నమ్మకం పెంచుకొని ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండానే మహిళలను, పిల్లలను దాచినటువంటి మదీనా యొక్క ఇతర ప్రాంతంపై బనూ ఖురైజా వారు దాడి చేయాలి. ఈ విధముగా ముసల్మానుల బలం మొత్తం అణిగిపోతుంది. ” అక్కడి నుండి దాడులు చేయవలెను. “అలా ఒకే సమయంలో ముసల్మాను పురుషులు, స్త్రీలు, పిల్లలు అందరు చంపబడుతారు. ఒకవేళ ఈ ప్రయత్నంలో అవిశ్వాసులు ఏ కొద్దిగా విజయం సాధించినా కూడ ముసల్మానులకు ఎక్కడ కూడ సురక్షితమైన ప్రాంతమే దొరికేది కాదు. బనూ ఖురైజా వారు ముసల్మానుల మిత్ర పక్షకులు. కావున వారు ఒకవేళ బహిరంగముగా యుద్ధంలో పాల్గొనక పోయినా కూడ వారి ప్రాంతం వైపు నుండి ఎవరు కూడ మదీనాపై దాడి చేయరనే నమ్మకాన్ని ముసల్మానులు కల్గియున్నారు. అందువలనే వారి వైపు ఉన్నటు వంటి ప్రాంతాన్ని అలాగే వదిలి వేశారు.

బనూ ఖురైజా మరియు అవిశ్వాసులు ఈ పరిస్థితిని అంచనా వేసుకోనే మరొక నిర్ణయం తీసుకున్నారు. అదేమనగా, బనూ ఖురైజా వారు అవిశ్వాసులతో చేతులు కలిపినప్పుడు వారు బహిరంగముగా అవిశ్వాసులతో కలిసి పోరాడవద్దు. ఎందుకనగా విషయం తెలిసినచో ముసల్మానులు ఈ ప్రాంతం వైపు కూడ అనగా బనూ ఖురైజా ప్రాంతంతో కలిసి ఉన్న ప్రాంతంలో ఏదైన రక్షణ చర్యలు చేపట్టవచ్చును. ” వారు చాలా తెలివి తేటలను ఉపయోగించారు. అనగా అటు వైపు నుండి దాడులు జరుగవచ్చునని ముసల్మానులకు ఆలోచనలు రాకుండా వ్యవహరించాలి. “ఇది చాలా భయంకరమైన కుట్ర. ఒకవైపు ముసల్మానులను నమ్మిస్తూ, మరోవైపు ముసల్మానులకు మరియు అవిశ్వాసులకు భీకరమైన యుద్ధం

జరుగుతున్నప్పుడు సమయం చూసుకోని బనూ ఖురైజా శత్రువులతో చేతులు కలపాలి. ఈ కుట్ర బనూ ఖురైజా కోటలు ఉన్నటు వంటి ప్రాంతాన్ని పూర్తిగా అసురక్షితముగా చేస్తుంది. ” (దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 272-273) కేవలం రక్షణ చర్యలే కాదు. ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు రక్షించే ప్రయత్నం ప్రక్కన బెట్టినచో దాడుల భయమే ఎక్కువైపోతుంది.

మొత్తానికి అలాంటి పరిస్థితులలో ముసల్మానులు చింతించడం సహజమే. అట్టి కుట్రను భగ్నం చేయుటకు కూడ తప్పకుండా ప్రయత్నించాలి. అందుకోసమే మదీనా యొక్క రక్షణ కోసం 500ల మంది సైనికులను నియమించాలని ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణయించుకున్నారు. ఆ వివరాలను జీవిత చరిత్ర రచయితలు ఈ విధముగా పేర్కొన్నారు. బనూ ఖురైజా ఒప్పందాన్ని ఉల్లంఘించిన విషయం ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియగానే వారి భయం ఇంకా పెరిగిపోయింది. హుజూర్ (స) కు మహిళలు, పిల్లల విషయంలో చింతన కల్గినది. ఆ సమయంలో ముసల్మానుల పరిస్థితి అల్లాహ్ తాలా తెల్పినట్లుగానే నెలకొన్నది. అనగా **ఇజ్ జాఊకుం మ్మిన్ ఫౌఖికుం వమిన్ అస్ఫల మిన్కుం వ ఇజ్ జాఘతిల్ అబ్సారు వ బలఘతిల్ ఖులూబుల్ హనాజిర వ తజున్నూన బిల్లాహి జ్జునూనా (అహ్జాబ్ :11)** వారు మీ వద్దకు మీ భాగము నుండి, మీ క్రింది భాగము నుండి వచ్చినప్పుడు కనులు చూచుట మరిచి, స్థింభించి, హృదయములు కంపించుచు పైకెగబాకినప్పుడు మీరు అల్లాహ్‌ను పరిపరి విధముగా అనుమానించు చుండిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ముసల్మానులు శత్రువుల ముందు ఉన్నారు. అనేక చోట్ల వంతుల వారిగా ఖందకంపై కాపాల విధులను నిర్వహిస్తున్నారు. వారు అక్కడి నుండి కదలలేని పరిస్థితిలో ఉన్నారు. జీవిత రచయితలు కాపాల కాస్తున్న ఖందకం యొక్క 8 ప్రాంతాల పేర్లను పేర్కొన్నారు. వారందరికి హజ్రత్ జుబైర్ బిన్ ఔవామ్ రజి పర్యవేక్షకులుగా నియమించ బడ్డారు.

బనూ ఖురైజా తెగ ఇప్పుడు ఒప్పందాలను రద్దు చేసుకోని ముట్టడి చేసిన తెగలలో కలిసి పోయింది. వారు ఏ సమయంలోనైన మదీనాపై దాడి చేయవచ్చుననే వారిని గూర్చిన సమాచారం అందుతూనే ఉన్నది. ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఈ సమాచారం తెలియగానే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ సలమా బిన్ అస్లం రజికు 200ల మంది సైనికులు అప్పగిస్తూ, అదే విధముగా హజ్రత్ జైద్ బిన్ హారిస్ రజికు 300ల మంది సైనికులను అప్పగిస్తూ మదీనాను రక్షించడం కోసం పంపించారు. అంతేగాకా రాత్రివేళలలో ప్రత్యేకముగా అనేక చోట్ల కాపాల ఉండండి. అప్పుడప్పుడు తక్బీర్‌లు అనగా అల్లాహ్ అక్బర్ అనే నినాదాలు చేస్తూ ఉండండి అని తెలిపారు.

**(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 4, పేజి 384-385, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్)( అస్సహీ మిన్ సీరతున్నబీల్ అఅజం సల్లల్లాహు అలైహి వసల్లం, సంపుటి 10, పేజి 288, ప్రచురణ అల్ మర్కజీ ఇస్లామీ లిల్ దరాసాతి బెహ్‌రూత్ 2006)**

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ రజి ఈ విషయాన్ని ఈ విధముగా తెలిపారు. “ ఆ సమయంలో మదీనా అదృష్టం బాహ్యసామాగ్రి పరంగా తీవ్ర అంధాకారంలో ఉన్నది. నగరానికి నలువైపు వేలాది మంది రక్తపిపాసీలు డేరాలు వేసుకోని ఉన్నారు. సమయం ఎప్పుడు దొరకుతుంది? ఎప్పుడు ముసల్మానులపై దాడి చేయాలి? ఎప్పుడు వారిని అంతమొందించాలి? అని ఎదురు చూస్తున్నారు. నగరంలో ముసల్మానుల ప్రక్కన బనూ ఖురైజాకు చెందిన ద్రోహులు ఉన్నారు. వారి వద్ద ఉన్నటు వంటి వందలాది మంది వీరులు ఒక పెద్ద సైన్యం కంటే తక్కువేమి కాదు. వారికి సమయం దొరికినచో, సందర్భము కలిసి వచ్చినచో వారు వెనకాల నుండి ముసల్మానులపై దాడి చేయుటకు సిద్ధముగా ఉన్నారు. నగరంలో ఉన్నటు వంటి ముసల్మాను మహిళలు, పిల్లలు ఒక విధముగా వారి వేటకు గుర్తైనట్లు గానే ఉన్నారు. ప్రతి వివేకవంతునికి అర్థమయ్యే అట్టి సున్నిత అంశము వలన బలహీన ముసల్మానులలో తీవ్రమైన భయాందోళనలను రేకిత్తించ సాగాయి. కపట విశ్వాసులు బహిరంగాముసే ప్రకటనలు చేయసాగారు. **మా వఅదనా ల్లాహు వ రసూలుహూ ఇల్లా ఘురూర (అహ్జాబ్:13)** అనగా ముసల్మానులు విజేయులు, సఫలీకృతులు అవుతారు అని అల్లాహ్ మరియు అతని ప్రవక్త చేసిన వాగ్దానాలు అసత్యలుగానే కనిపిస్తున్నాయి.” కొందరు కపట విశ్వాసులు ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకోని ఓ రసూలుల్లాహ్ ! నగరంలోని మా ఇండ్లు పూర్తిగా రక్షణరహితముగా ఉన్నాయి. మీరు అనుమతించినచో మేము మా ఇండ్లలో ఉండి వాటిని రక్షించుకుంటాము అడిగారు. అందుకు సమాధానంగా అల్లాహ్ తాలా యొక్క దైవవాణి ఇలా అవతరించింది. **వమా హియ బి ఔరతిన్ ఇన్ య్యురీదూన ఇల్లా ఫిరార (అహ్జాబ్ :14)** అనగా వారి ఇండ్లు సురక్షితముగా లేవనడం ఇది సరికాదు. వాస్తవానికి వారు యుద్ధ మైదానం నుండి పారిపోవడానికి తగిన మార్గంను అన్వేషిస్తున్నారు. కాని నిజానికి స్వచ్ఛమైన ముసల్మానులు విశ్వాస ప్రతిమను ప్రదర్శించు అసలైన సమయం ఇదే. ఈ విషయాన్నే ఖుర్ఆన్ ఇలా తెల్పింది.

**వలమ్మా రఅల్ మోమినూనల్ అహ్జాబ ఖాలూ హాజాఅ మా వఅదనా ల్లాహు వరసూలుహూ వసదఖల్లాహు వ రసూలుహూ వమా జాదహుం ఇల్లా ఈమానన్ వ్వ తస్‌లీమా (అహ్జాబ్:23)** అనగా విశ్వాసులు శత్రువుల అతి పెద్ద సైన్యంను చూసినప్పుడు వారు ఇట్లన్నారు. ఇదంతయు అల్లాహ్ మరియు అతని ప్రవక్త వాగ్దానాల ప్రకారమే జరుగుచున్నది. అల్లాహ్ మరియు అతని ప్రవక్త తప్పకుండా సత్యవంతులే.

కావున ఈ దాడుల వలన కూడ విశ్వాసుల విశ్వాసం మరియు నమ్మకం ఇంకా పెరిగిపోయాయి. కాని క్లిష్ట పరిస్థితులను, భయంకరమైన దృశ్యాల ప్రభావం అందరిపై ఒకే విధముగా ఉన్నది. ఈ విషయాన్నే అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పినాడు.

**ఇజ్ జాఅఊకుం మ్మిన్ ఫౌఖికుం వ మిన్ అస్ఫల మిన్కుం వ ఇజ్ జాఘతిల్ అబ్‌సారు వ బలఘతిల్ ఖులూబుల్ హనాజిర వ తజున్నూన బిల్లాహి జ్జునూనా హునాలికబ్‌తులీయల్ మూమినూన వ జుల్‌జిలూ జిల్‌జాలన్ షదీద (అహ్జాబ్:11-12)** వారు మీ వద్దకు మీ భాగము నుండి, మీ క్రింది భాగము నుండి వచ్చినప్పుడు కనులు చూచుట మరిచి, స్థింభించి, హృదయములు కంపించుచు పైకెగబాకినప్పుడు మీరు అల్లాహ్‌ను పరిపరి విధముగా అనుమానించు చుండిరి.ం అచట విశ్వాసులు ఆపదలో పడవేయబడిరి. కఠినముగా (పరీక్షించబడి ) కదిలించబడిరి.

ఇలాంటి భయంకరమైన పరిస్థితులలో ముసల్మానుల అతి తక్కువ సైన్యం, వారిలో కొందరు బలహీన స్వభావంను కల్గినవారు, మరికొందరు కపట విశ్వాసులు ఉన్నటు వంటి సైన్యం శత్రువులను ఎదురించగలదా?. బలహీన ప్రాంతాలలో కాపాలగా నియమించుటకు వారి వద్ద సరైన ఏర్పాట్లు చేయుటకు కూడ మనుషులు లేరు. అందువలన రాత్రింభవళ్ళు కఠినమైన విధి నిర్వాహణ ముసల్మానులను సన్నగిల్లునట్లు చేసింది. మరోవైపు బనూ ఖురైజా చేసిన నమ్మక ద్రోహం వలన నగరంలోని వీధులలో కాపాల వ్యవస్థను ఇంకా పటిష్టం తప్పక చేయవలసి వచ్చింది. తద్వారా ముస్లిం మహిళలు, పిల్లలను సురక్షితముగా కాపాడవచ్చును. శత్రు సైన్యం ముసల్మానులను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేయుటకు ప్రయత్నిస్తుంది. కొన్ని సార్లు వారు తక్కువ వెడల్పు ఉన్న ఖందకం వద్దకు చేరి అక్కడ ఏకమయ్యేవారు. వారిని ఎదుర్కొనుటకు ముసల్మానులు ఆ ప్రాంతానికి పరుగులు తీసేవారు. ఆ తరువాత వారు వెంటనే తమ దిశను మార్చుకోని మరొక ప్రాంతానికి వెళ్ళి అక్కడ ఏకమయ్యేవారు. ఈ అమాయక ముసల్మానులు మరల పరుగులు తీస్తూ అక్కడికి వెళ్ళి వారిని ఎదుర్కొవడానికి ప్రయత్నించేవారు. కొన్ని సార్లు శత్రువులు ఒకేసారి రెండు, మూడు ప్రాంతాల నుండి ఖందకం దాటడానికి ప్రయత్నం చేసేవారు. అలాంటి పరిస్థితులలో ముసల్మానులు కూడ సమూహం నుండి బృంధాలుగా వీడి ఆయా ప్రాంతాలకు పరుగులు తీసేవారు. కొన్ని సార్లు పరిస్థితులు చాలా భయంకరముగా మారిపోయేవి. ముసల్మానులు పరుగులు తీస్తున్న సమయంలో ఏదేని బలహీన ప్రాంతం నుండి శత్రువులు ఎక్కడ నగరంలోకి ప్రవేశిస్తారో అని కంపించిపోయేవారు. సాధారణముగా ముసల్మానులు శత్రువులను బాణాల ద్వారా ఎదుర్కొనేవారు. అందువలన కొన్ని సందర్భాలలో శత్రువుల ఒక బృంధం ముసల్మానులపై వరుసగా బాణాలు విసురుతూ ముసల్మానులను వెనుకకు జరిగేలా చేసేవారు. అదే సమయంలో శత్రువుల మరొక బృంధం బలహీన ఖందక ప్రాంతంను ఎంచుకోని దానిని దాటుకుంటూ నగరంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించేవారు. ఇలాంటి యుద్ధం ఉదయం నుండి సాయంత్రం వరకు కొన్నిసార్లు అయితే రాత్రి వేళ వరకు కూడ కొనసాగుతూ ఉండేది. ”

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స) హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ రజి ఎం.ఏ పేజి 585-586)**

ఒకానొక సందర్భములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఘత్ఫాన్ తెగవారితో ఒప్పందం చేసుకునే ఆలోచనతో అనుచరులను, ప్రత్యేకించి అన్సారులను సలహా అడిగినట్లు కూడ చరిత్రలో పొందుపర్చడం జరిగింది.

ఈ విషయమై వివరాలలోకి వెళ్ళినచో హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి గారు ఇలా పేర్కొన్నారు. “ ఆ రోజులు ముసల్మానుల కొరకు చాలా బాధాకర, ఆందోళనకర మరియు భయంకరమైన రోజులుగా మారాయి. ఈ ముట్టడి కాలం పెరుగుతున్న కొద్ది ముసల్మానులలో శత్రువులను ఎదుర్కొనే శక్తి ఖచ్చితముగా బలహీనమై పోసాగింది. నిజానికి వారి మనస్సులు విశ్వాసం, స్వచ్ఛతతో నిండి యున్నప్పటికి, శారీరక వ్యవస్థ ప్రకృతి ధర్మంను అనుసరించి నడుస్తుంది కావున, అది బలహీనమై పోతూ ఉంటుంది. ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆయా పరిస్థితులను చూసి, అన్సారుల నాయకులైన సఅద్ బిన్ ముఆఅజ్ మరియు సఅద్ బిన్ ఉబాదాహ్‌లను పిలిపించి, వారికి పరిస్థితులన్నింటిని గూర్చి వివరించి, ఏమి చేద్దాం అని సలహా అడిగారు. అదే విధముగా హుజూర్ (స) ఒకవేళ మీరు కోరుకున్నచో ఘత్ఫాన్ తెగవారికి మదీనా నగరంలోని కొంత భాగాన్ని అప్పజెప్పి ఈ యుద్ధం నుండి తప్పించుకోవచ్చును అని తమ అభిప్రాయాన్ని కూడ తెలియ జేశారు. అందుకు సఅద్ బిన్ ముఅజ్ మరియు సఅద్ బిన్ ఉబాదాహ్ లు ముక్త కంఠంతో ఇలా అన్నారు. “ ఓ రసూలుల్లాహ్ ! ఒకవేళ మీకు ఈ విషయంను గూర్చి అల్లాహ్ తాలా నుండి దైవవాణి అందినచో అందుకు మేము శిరస్సు వహించి పాటిస్తాము. అందువలన మీరు ఈ విషయంలో సంతోషంగా ఆ ఆదేశాను

సారాంగా ఆచరించవచ్చును. ” అప్పుడు హుజూర్ (స) “ఇలా అని నాకు దైవవాణి అవతరించలేదు. నేను కేవలం మీ బాధలను చూసి నా వైపు నుండి ఈ సలహాను అడుగుతున్నాను అని అన్నారు. ” అందుకు సఅదైన్ అనగా ఇరువురు సఅద్ బిన్ ఉబాదాహ్ మరియు సఅద్ బిన్ ముఆజ్‌లు ఇలా సమాధానం ఇచ్చారు. అలాగైనచో మా అభిప్రాయం ఏమిటనగా, మేము విగ్రహారాధన చేస్తున్న సమయంలోనే ఎన్నడు మేము ఏ శత్రువుకు ఏమి ఇవ్వలేదు. అలాంది, ఇప్పుడు మేము ముసల్మానులపై ఎలా, ఎందుకు ఇస్తాము?. అల్లాహ్ ప్రమాణం! మేము వారికి ఖడ్గపు దాడులను తప్ప మరేమి ఇవ్వము. ”

ఇప్పుడు యుద్ధమే కొనసాగుతున్నది కదా. “వాస్తవానికి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు మదీనాకు అసలు వారసులైన అన్సారుల వలన చింతన పెరుగుచుండెను. కావున అన్సారులు ఈ సమస్యల వలన ఏమైన ఇబ్బందిని భావిస్తున్నారా? లేదా?, ఒకవేళ వారు ఇబ్బంధి కరముగా ఉన్నట్లయితే వారికి ధైర్యం చెప్పడం కోసమే వారి ఆలోచనలు ఎలా ఉన్నాయో బహుశా తెలుసు కోవడానికే హుజూర్ (స) ఈ సలహాను ఇచ్చి ఉండవచ్చును. అందువలన హుజూర్ (స) పూర్తి సంతోషంతో వారి సలహాను స్వీకరించారు. ” అనా సఅదైన్‌ల సలహాను “ అలా యుద్ధాన్ని కొనసాగించారు. ”

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స), హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ రజి ఎం.ఏ పేజి 589-590)**

ముందుగా ప్రస్తావించినట్లుగానే ఖందకం ఒక పటిష్టమైన గోడవలే సహాయం చేస్తున్నప్పటికి, అందువలన ముసల్మానులు పూర్తి సురక్షితముగా ఉన్నారని దాని అర్థం ఏమాత్రం కాదు. మొదటి విషయమేమనగా, కపట విశ్వాసులు మరియు ప్రత్యేకించి బనూ ఖురైజా తెగకు చెందిన యుద్ధవీరులు మదీనాలోనే ఉన్నారు. ఒప్పందంను రద్దు చేసుకున్న తరువాత వీరందరు ఒక భయంకరమైన శత్రువుల వలే ముందుకు రావచ్చును. మరోవైపు ఖందకం త్రవ్వినప్పటికి కూడ కొన్ని ప్రాంతాలు శత్రువులు ఆయా ప్రాంతాలను దాటుతూ నగరంలోకి ప్రవేశించి దాడి చేయడానికి వీలుగా ఉన్నాయి. మరోవైపు ఆయా ప్రాంతాల నుండి శత్రువులు దాడులు కూడ చేస్తున్నారు. ఈ సమస్యాత్మక పరిస్థితుల దృష్ట్యా అనేక చోట్ల కాపలా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కాపలా విధిలో స్వయముగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూడ పాల్గొన్నారు. హుజూర్ (స) స్వయముగా పర్యవేక్షణ కూడ చేసేవారు. అనుచరులను విధులకు పంపేవారు. ఈ పనులన్ని పగలు కొనసాగేవి మరల రాత్రివేళలలో కొనసాగేవి. మదీనా రాత్రులు తీవ్రమైన చలి రాత్రులు. ఆకలి, దప్పికల కష్టాలు, సమస్యలు అంతకు మించి ఉండేవి.

హజ్రత్ ఆయిషా రజి ఇలా తెలిపారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖందకపు అంచు వరకు పర్యవేక్షణ కోసం వెళ్ళి వచ్చేవారు. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంకు చలి వలన ఇబ్బంది కల్గినప్పుడు నా శిభిరం వద్దకు వచ్చేవారు. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంకు చలి తీవ్రత తగ్గిపోగానే మరల ఖందకపు అంచు వరకు పర్యవేక్షణకు వెళ్లేవారు. ఆ క్రమంలో హుజూర్ (స) అటు వైపు నుండి కూడ శత్రువులు రావచ్చును అని నేను భయపడుతున్నాను అనేవారు. మరల వారు (రజి ) ఇలా తెలిపారు. ఒకరోజు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం విశ్రాంతి తీసుకోనుచున్నారు. చాలా తీవ్రముగా అలసిపోయారు. ఆ క్రమంలోనే ఇలా అన్నారు. బహుశా ఈ రాత్రి ఏ పుణ్యాత్ముడైన ఈ ప్రాంతానికి కాపలా కాసినచో బాగుండేను. హుజూర్ (స) అలా మాట్లాడుతుండానే, హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఆయుధాల శబ్ధం వినిపించింది. ఎవరు? అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అడిగారు. అందుకు సఅద్ బిన్ ఉబై వఖాస్ రజి ఓ రసూలుల్లాహ్! నేను సఅద్‌ను, మీకు కాపలా కోసం వచ్చాను అని సమాధానం ఇచ్చాడు. అప్పుడు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ కాపలా కోసం కాకుండా నీవు ఫలాన ప్రాంతానికి వెళ్ళుము, అక్కడ ఖందకపు భాగం చాలా బలహీనముగా ఉన్నది, అక్కడ కాపలా ఉండుము అని అన్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ప్రాణాలర్పించు అనుచరులకు హుజూర్ (స) పట్ల ఉన్న ప్రేమాభిమానాలు ఎంత అద్భుతమయమో, ఎంతగా వారు తమను తాము సమర్పించుకుంటున్నారో చూడండి!. మరోవైపు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను చూడండి. తమపై అనుచరులకు ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఎంతటి వీరత్వం అనగా, హుజూర్ (స)కు తమ ప్రాణాలను గూర్చి ఏ మాత్రం చింతనే లేదు. మదీనా వాసుల కోసం మాత్రమే చింతన ఉన్నది. అందు కోసమే ఎక్కువ శాతం హుజూర్ (స) స్వయముగా వివిధ ప్రాంతాలలో కాపలా ఉండే వారు. ఎప్పుడైన విశ్రాంతి తీసుకోవడానికి తమ శిభిరానికి వెళ్ళినచో అప్పుడు కూడ ఎక్కువ సమయం అల్లాహ్ తాలా సన్నిధిలోనే సాష్టాంగం చేస్తుండేవారు. దుఆలు చేస్తూ కనిపించేవారు.

ఈ క్రమంలోనే హజ్రత్ ఉమ్మే సల్మా రజి ఇలా తెలిపారు. ఖందకం యుద్ధ సమయంలో నేను కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు ఉన్నాను. తీవ్రమైన చలిలో ఉన్నాము. ఒక రాత్రి నేను గమనించి చూడగా హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం శిభిరంలో అల్లాహ్ తాలా కోరినంతగా నమాజ్ చేస్తున్నారు. అనగా ఎంత వరకు సాధ్యమో అంత సుదీర్ఘమైన నమాజ్‌ను చదువుతున్నారు. ఆ తరువాత కొంత సమయం శిభిరం నుండి బయటికి వెళ్ళారు. ఆ సమయంలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా మాట్లాడుతుండగా నేను విన్నాను. ఈ శత్రువుల అశ్వధళపు సైన్యం ఈ ఖందకాన్ని దాటుటకు ప్రయత్నిస్తుంది. ఆ తరువాత అబ్బాద్ బిణ్ బిషర్ రజిను పిలువగా వారు లబ్బైక్ ! నేను వస్తున్నాను అని సమాధానం ఇచ్చారు. నీతో పాటు మరెవరైన ఉన్నారా? అని హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం అతనిని అడిగారు. అందుకు వారు హాం, నాతో పాటు నా మిత్రులు కొందరు ఉన్నారు, మీ శిభిరం చుట్టు కాపలా ఉన్నాము అని సమాధానం ఇచ్చారు. అప్పుడు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. నీ మిత్రులను తీసుకోని వెళ్ళి ఖందకంను ఒకసారి చూసి రమ్ము, ఈ శత్రువుల గుర్రపు సైన్యం ఖందకంను దాటుటకు ప్రయత్నిస్తుంది. మీరు అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు మీపై దాడి చేయాలని వారు చూస్తున్నారు. ఆపై హుజూర్ (స) ఇలా దుఆ చేశారు. **అల్లాహుమ్మా ఫాద్‌ఫఅ అన్నా షర్రహుం వన్‌సుర్‌నా అలైహిం వఖ్‌లిబ్‌హుం ఫలా య్‌లిబుహుం అహదున్ ఘైరుక.** ఓ అల్లాహ్! మా నుండి వారి దుష్కార్యములను దూరం చేయుము. వారికి భిన్నముగా మాకు సహాయంను అందించుము. వారిని ఓడించుము. నీవు వారిని మరెవరు ఓడించలేరు. అబ్బాద్ రజి తన మిత్రులతో కలిసి ఖందకం వద్దకు వెళ్ళగా అబూసుఫ్యాన్ బిన్ హర్‌బ్ తన సైనికులతో పాటు ఖందకం యొక్క బలహీన ప్రాంతం ఎక్కడ ఉన్నది? అని క్షుణ్ణముగా అన్వేషిస్తున్నారు. వారి కదలికలు ముసల్మానులకు తెలిసిపోయాయి. అందువలన ముసల్మానులు వారిపై రాళ్ళను బాణాలను విసరడం ప్రారంభించారు. ఫలితముగా వారు తమ తమ శిభిరాల వద్దకు తిరిగి వెళ్ళిపోయారు. అనగా శత్రువులు అక్కడి నుండి పారిపోయారు. హజ్రత్ అబ్బాద్ రజి ఇలా తెలిపారు. నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకున్నాను. ఆ సమయంలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నమాజ్ చదవడాన్ని నేను చూశాను. నేను విషయాన్ని హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియజేశాను. హజ్రత్ ఉమ్మే సల్మా రజి ఇలా తెలిపారు. అల్లాహ్ తాలా అబ్బాద్ బిన్ బిషర్‌ను కరుణించుగాకా!. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం శిభిరం వద్ద ఇతర అనుచరులందరి కంటే వారే ఎక్కువ సమయం కాపలాగా ఉండేవారు. పదే పదే ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు కాపలాగా ఉండేవారు.

**(సుబూలుల్ హుదా వర్రిషాద్ సంపుటి 4, పేజి 374-375, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్)**

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు ఇలా తెలిపారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ధైర్యసహసాలు మరియు ముసల్మానుల యోగక్షేమాల స్థితి గతులు ఎలా ఉండేవనగా, హుజూర్ (స) తీవ్రమైన చలిలో కూడ రాత్రివేళ ఖందకం వద్ద కాపలా ఉండడం కోసం వెళ్ళేవారు. హజ్రత్ ఆయిషా రజి ఇలా తెలిపారు. హుజూర్ (స) కాపలా ఉంటూ అలసిపోయేవారు. చలి వలన అచేతనానికి గురయ్యేవారు. అందువలన కొంత సమయం శిభిరంలోకి వచ్చి ఉన్ని దుప్పటిని కప్పుకునేవారు. కొంత ఉపశమనం కల్గిన వెంటనే మరల ఖందకం వద్ద కాపలా కోసం వెళ్ళేవారు. అలా నిరంతరం మేల్కొని ఉండడం వలన ఒక రోజు పూర్తిగా నిస్సహాయులైపోయారు. రాత్రివేళలో ఇలా అన్నారు. బహుశా! ఈ సమయంలో ఏ పుణ్యాత్ముడైన ముసల్మానుడు ఆ ప్రాంతంలో కాపలా ఉండినచో నేను నిద్రించేవాడిని. అంతలోనే బయట సఅద్ బిన్ వఖాస్ రజి మాటలు వినిపించాయి. హుజూర్ (స) వారిని ఎందుకు వచ్చావు? అని అడిగారు. అందుకు వారు రజి నేను మీకు కాపలా ఉండడానికి వచ్చాను అని సమాధానం ఇచ్చారు. అప్పుడు హుజూర్ (స) నాకు ఎలాంటి కాపలా అవసరం లేదు. నీవు ఫలాన ఖందకం కూలిన చోటుకు వెళ్ళి అక్కడ కాపలా ఉండుము. తద్వారా ముసల్మానులు

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | **“అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. ” (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |
|---|---|

**దుఆ ఆశించువారు:** ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***

99633 83271 Pro. SK.Sultan 97014 62176
Oxygen Nursery
All kind of Plants are Available.
➤ Rajahmundry
➤ Kadiyapu lanka, E.G.dist.
➤ Andhra Pradesh 533126.
➤ #email. oxygennursery786@gmail.com
Love for All...Hatred for None

సురక్షితముగా ఉంటారు అని అన్నారు. అందువలన సఅద్ రజి ఆ ప్రాంతానికి కాపలా ఉండడానికి వెళ్ళారు. ఆ సమయంలో హుజూర్ (స) నిద్రించారు. (ఆశ్చర్యకరమైన విషయమేమనగా, ఈ వివరణ మరొక చోట ఈ విధముగా గలదు. హుజూర్ (స) మదీనాకు వచ్చిన ప్రారంభంలో చాలా పెద్ద ఆందోళన పరిస్థితులు నెలకొని ఉండేవి. అప్పుడు కూడ ఈ సఅద్ రజి కాపలా ఉండడానికి వచ్చారు. ) ఆ రోజులలోనే హుజూర్ (స) ఒక రోజు కొన్ని ఆయుధాల శబ్దాలను విన్నారు. అప్పుడు ఎవరు అక్కడ? అని అడిగారు. అందుకు అబ్బాద్ బిన్ బషీర్ " హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇక్కడ అబ్బాద్ బిన్ బషీర్ రజి అని పేర్కొన్నారు. ఎందుకనగా వారు అబ్బాద్ బిన్ బషీర్ అని పేర్కొన్నారు. కావున అన్వారుల్ ఉలూమ్ సంపుటి 20లో ఈ పేరు అబ్బాద్ బిన్ బషీర్ అని లిఖించబడి ఉన్నది. వాస్తవానికి ఇది వ్రాసిన వారి తప్పిదం. అన్వారుల్ ఉలూమ్‌లో ని ఆ పేరాను సీరతుల్ హలబియా నుండి సేకరించడం జరిగింది. సీరతుల్ హలబియాలో వారి పేరు అబ్బాద్ బిన్ బషీర్ అని వ్రాసి ఉన్నది. ఈ వివరణ నేను ఎందుకు తెల్పుచున్నాను అంటే తరువాత కొందరు ఫలాన చోట ఇలా ఉండగా, మీరు ఇలా పలికారు, వాస్తవం ఏమిటి? అని నాకు లేఖలు వ్రాస్తుంటారు. నిజానికి అబ్బాద్ బిన్ బిషర్ అసలు పేరు. మొత్తానికి వారు అనగా అబ్బాద్ బిన్ బషీర్ నేను అని అన్నారు. అనగా అబ్బాద్ బిన్ బిషర్ అన్నాడు. అప్పుడు హుజూర్ (స) నీతో పాటు ఎవరైనా ఉన్నారా? అని అడిగారు. వారు అవును నాతో పాటు అనుచరుల ఒక బృంధం ఉన్నది. మేము మీ శిబిరానికి కాపలా ఉండడానికి వచ్చాము అని సమాధానం ఇచ్చారు. అందుకు హుజూర్ (స) " ప్రస్తుతం శత్రువులు ఖందకాన్ని దాటుటకు ప్రయత్నిస్తున్నారు. మీరు అక్కడికి వెళ్ళండి, వారిని ఎదురించండి. నా శిబిరాన్ని వదిలి వేయండి "అని అన్నారు.

**(దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 279)(సీరతుల్ హలబియా, సంపుటి 3, పేజి 25, ప్రచురణ దారుల్ మాఅరుఫతు బేహ్రూత్)**

ఈ యుద్ధంలో హజ్రత్ సఫియా రజి గారి ధైర్యసహసాల ఘట్టము కూడ మనకు లభిస్తుంది. ఆ వివరాలను చూసినచో ఇలా గలవు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి పవిత్ర సతీమణులు మరియు హుజూర్ (స) గారి మేనత్త హజ్రత్ సఫియా బిన్త్ అబ్దుల్ ముత్తలిబ్ ఇతర మహిళలతో పాటు ఒక ఫారిఅ అనే కోటలో ఉన్నారు. అనగా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి సతీమణులు, హుజూర్ (స) గారి మేనత్త మరియు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి సమీప బంధువులు, ఇతర ముస్లిం మహిళలు అందరు ఒక కోటలో ఉన్నారు. ఆ కోటకు హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ రజిను పర్యవేక్షకుడిగా నియమించడం జరిగింది. బనూ ఖురైజా వారు ఒప్పందంను రద్దు చేసుకున్నట్లుగా ప్రకటించినప్పుడు, అక్కడి యూదులు ఏదో ఒక విధముగా ముసల్మానులకు నష్టాన్ని చేకూర్చుటకు ప్రయత్నించడం మొదలుపెట్టారు. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి మేనత్త అయినా హజ్రత్ సఫియా రజి ఇలా తెలిపారు. ఒకసారి ఒక యూదుడు వచ్చాడు. అతడు మా కోట చుట్టు ప్రక్కల పదే పదే తిరుగుతూ ఎప్పుడు, ఎక్కడి నుండి ఎలా కోటలోకి ప్రవేశించాలి అని అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. అంతలోనే మరొక యూదుడు కోట గోడకు అతి సమీపంలోకి వచ్చాడు. నేను అతడిని గమనిస్తూనే ఉన్నాను. నేను హస్సాన్‌తో ఇలా అన్నాను. ఓ హస్సాన్! ఇటు వచ్చి ఆ యూదుడిని ఎదురించుము అని అన్నాను. అందుకు హస్సాన్ ఓ అబ్దుల్ ముత్తలిబ్ కుమార్తే! అల్లాహ్ ప్రమాణం! నేను అంతటి ధైర్యవంతుడిని కాను. ఒకవేళ నిజంగా నాకు అంతటి ధైర్యం ఉన్నట్లయితే నేను కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతోనే వెళ్ళవాడిని. హజ్రత్ సఫియా రజి ఇలా తెలిపారు. హస్సాన్ ఈ విధమైన సమాధానం ఇచ్చినప్పుడు వెంటనే నేను అక్కడ ఉన్నటువంటి ఒక కర్రను తీసుకోని , కోటపై నుండి క్రిందికి దిగి, అక్కడికి వచ్చిన యూదుడి మరియు అక్కడే తిరుగుచున్న మరోక యూదుడి తలపై గట్టిగా కొట్టడంతో ఆ యూదులు అక్కడే కుప్పకూలి పోయారు. నేను తిరిగి కోటపైకి వచ్చి హస్సాన్‌తో " క్రిందికి వెళ్ళి అతని వద్ద ఉన్నటు వంటి సామాగ్రిని తీసుకోని రమ్ము " అని అన్నాను. అనగా అతని వద్ద ఉన్న సమాగ్రిని యుద్ధ సంపదగా నీవే తీసుకో అని చెప్పాను. అందుకు హస్సాన్ ఇలా ఓ అబ్దుల్ ముత్తలిబ్ కుమార్తే! నాకు అతని సామాగ్రి అవసరం లేదు అని అన్నాడు. అప్పుడు నేను అలాగైనచో ఆ యూదుల తలను కోసి మిగిలిన యూదుల వైపు విసరివేయుము. వాటిని చూసి మిగిలిన యూదులు బయపడుతారు, ఇటు వైపు తిరిగి చూడరు అని అన్నాను. అందుకు హజ్రత్ హస్సాన్ రజి ఇలా అన్నారు. నాలో ఆ ధైర్యం కూడ లేదు. అప్పుడు హజ్రత్ సఫియా రజి అతని తలను కోసి యూదుల వైపు విసిరి వేశారు. (అప్పుడు స్వయముగా సఫియా రజి గారే వెళ్ళి వారి తలను కోసి, గోడ అవతలి వైపు విసిరి వేశారు. ) ఆ దృశ్యాన్ని యూదులు భయభ్రాంతులకు గురై, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మహిళలను ఒంటరిగా విడిచి వెళ్ళరు అని మాకు ముందే తెలుసు. ఖచ్చితముగా వారి రక్షణ కొరకు సైన్యాన్ని నియమించి ఉంటారని అని పరస్పరం మాట్లాడుకుంటూ మిగిలిన యూదులు అక్కడి నుండి పారిపోయారు. రసలూల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఈ విషయంను గూర్చి తెలియజేయగా హుజూర్ (స) యుద్ధ సంపద నుండి హజ్రత్ సఫియా రజికూడ సైనికులు నిర్ధేశించినట్లుగా ఒక భాగాన్ని నిర్ధేశించారు.


**(సుబులుల్ హుదా వ ర్రిషాద్ సంపుటి 4, పేజి 371-372, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బేహ్రూత్)**

సీరత్ ఖాతమున్నబియ్యాన్ (స) లో ఈ విషయాన్ని గూర్చి హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ రజి గారు ఇలా వ్రాసారు: "నగరంలోని మహిళలు మరియు పిల్లల పరిస్థితి ఎలా ఉన్నదనగా, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారందరిని సాధారణముగా నగరానికి చెందిన ఒక కోణంలో ఉన్నటు వంటి పురాతన కోటను తలపించు భవనంలో ఏకం చేశారు. కాని ఆ వారి కోసం ప్రత్యేకముగా సురక్షిత చర్యల కోసం పెద్ద సంఖ్యలో ముసల్మానులను నియమించలేదు. ప్రత్యేకించి ఇలా ంటి సమయంలో అనగా యుద్ధ మైదానంలో శత్రుల దాడులు తీవ్రతరంగా ఉన్న సమయంలో ముసల్మాను మహిళలు మరియు పిల్లలు సుమారుగా రక్షణ లేకుండానే ఉండేవారు. వారి రక్షణ కోసం కేవలం యుద్ధ మైదానంలో పాల్గొనలేనటువంటి పురుషులను మాత్రమే నియమించడం జరిగింది. ఈ క్రమంలోనే ఇలాంటి ఒకానొక సందర్భములోనే అవకాశాన్ని చూసుకోని కొందరు యూదులు నగరంలోని మహిళలు మరియు పిల్లలు ఉన్నటు వంటి ప్రాంతంపై దాడి చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ముందుగా గూఢచార్యం కోసం ఒక యూదుడిని తమ కంటే ముందు పరిస్థితులను గూర్చి తెలుసుకోని రమ్మని ఆ వీధికి పంపారు. ఆ సమయంలో దైవికముగా మహిళల సురక్షణ కోసం కేవలం ప్రముఖ కవి అయినా హస్సాన్ బిన్ సాబిత్ అనే అనుచరుడు మాత్రమే ఉన్నారు. నిజానికి వారు చాలా పిరికివారు. ఈ కారణం చేతనే వారు యుద్ధ మైదానానికి వెళ్ళలేక పోయారు. ఒక అపరిచిత యూదుడు ఒక అసాధారణ విధముగా అలా తమ స్థావరం వద్ద అనుమాన స్పధముగా తిరుగుచుండగా మహిళలు గమనించారు. ఈ క్రమంలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి మేనత్త అయినా హజ్రత్ సఫియా బిన్త్ అబ్దుల్ ముత్తలిబ్ గారు హస్సాన్ బిన్ సాబిత్ రజితో ఈ యూదుడు శత్రువు వర్గానికి చెందినవాడు. ఇక్కడికి గూఢచార్యం చేయడానికి, అల్లరులు సృష్టించడానికి ఇక్కడే తిరుగుచున్నాడు. అతడు వెనుదిరిగి వెళ్ళి ఏదో పెద్ద విపత్తును సృష్టించక ముందే నీవు అతనిని హతమార్చుము అని అన్నారు. కాని హస్సాన్ రజి అందుకు ధైర్యం సరిపోలేదు. అందువలన హజ్రత్ సఫియా రజి స్వయముగా ముందుకు వచ్చి ఆ యూదుడిని ఎదుర్కొని, అతని అక్కడే చంపివేశారు. ఆ తరువాత ఒక ఉపాయం ఆలోచించారు. అదేమనగా, ఆ గూఢచార్య యూదుడి తలను కోసి కోట వెనకాల దాచుకున్న యూదుల వైపు విసిరి వేసినచో ముసల్మాను మహిళలపై దాడి చేయుటకు యూదులు భయపడిపోతారు. పైగా మహిళల సురక్షణ కోసం చాలా మంది ముసల్మాను పురుషులు ఉన్నారని భావిస్తారు అని నిర్ణయించుకున్నారు. మొత్తానికి ఆ ఉపాయం చాలా విజయవంతమైనది. ఆ స్థితిని చూసి యూదులు భయభ్రాంతులకు గురై, అక్కడి నుండి పారిపోయారు. "

**(సీరత్ ఖాతమున్నబియ్యాన్ (స) హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ రజి ఎం.ఏ పేజి 590-591)**

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్హు గారు కూడ ఈ విషయాన్ని ఈ విధముగా తెలియజేశారు. " ముస్లిమేతరుల విద్వేషాన్ని రెచ్చగొట్టడం కోసం మదీనాలోకి చేరుకోని ముస్లిం మహిళలను, పిల్లలను చంపడానికి బనూ ఖురైజా అవకాశం కోసం ఎదురు చూడసాగింది. ఈ క్రమంలోనే బనూ ఖురైజా వారు ముస్లిం మహిళలు, పిల్లలు ఒంటరిగా ఉన్నారా? లేకా వారి రక్షణ కోసం చాలా మంది సైనికులను నియమించారా? తెలుసుకోని రావడం కోసం ఒక గూఢచారిని పంపారు. ఏయే ఏయే వంశీయులకు ప్రత్యేకముగా శత్రువులతో ఆపద ఉన్నదో ఆయా వంశీయులను సురక్షితముగా దాచిన ప్రాంతానికి ఆ గూఢచారి వెళ్ళి, చుట్టు ప్రక్కల ఎక్కడెక్కడ ముస్లిం సైన్యం దాక్కొని ఉన్నదో చూడడానికి అటు ఇటు చక్కర్లు కొట్టడం, పదే పదే పరీక్షించి చూడడం మొదలు పెట్టాడు. అతడు

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దువా ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

ఇంకా ఆ ప్రయత్నంలో ఉండగానే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మేనత్త అయినా హ్రజత్ సఫియా రజి ఈ గూడచారిని చూశారు. అనుకోకుండా ఆ సమయంలో అక్కడ కేవలం ఒకే ఒక్క ముస్లిం యువకుడు ఉన్నాడు. పైగా అతడు అనారోగ్యముతో ఉన్నాడు. హ్రజత్ సఫియారజి అతనితో " ఆ వ్యక్తి చాలా సమయం నుండి మహిళలు ఉంటున్నటు వంటి ఈ భవనం చుట్టూ తిరుగుతున్నాడు. నలువైపుల పరిశీలనగా చూస్తున్నాడు. వెళ్ళడం లేదు. ఖచ్చితముగా ఇతడు గూడచారియే. కావున నీవు వెళ్ళి అతనితో పోరాడుము, లేకపోతే శత్రువులు ఇక్కడి పరిస్థితులను గూర్చి తెలుసుకొని ఇటుగా వచ్చి దాడి చేయవచ్చును అని అన్నారు. ఆ అనారోగ్యముతో ఉన్నటు వంటి అనుచరుడు అతనిని ఎదురించుటకు తిరస్కరించాడు. అప్పుడు హ్రజత్ సఫియా రజి స్వయముగా ఒక పెద్ద వెదురు కర్రను తీసుకోని ఆ గూడచారిపై దాడి చేశారు. ఇతర మహిళల సహాయంతో అతనిని చంపివేశారు. చివరికి పరిశీలించి చూడగా, అతడు యూదుడని, బనూ ఖురైజా తెగకు చెందిన గూడచారి అని అర్థమైపోయింది. అప్పుడు ముసల్మానులు ఇంకా ఆందోళనకు గురైనారు. మదీనాలోని ఈ భాగం కూడ సురక్షితముగా లేదని గ్రహించారు. మరోవైపు ఖందకం ముందు అంత పెద్ద సైన్యం ఉన్నందున ఇటువైపు సురక్షితం కొరకు ప్రత్యేకముగా సైన్యంనుఏర్పాటు చేయలేని పరిస్థితి. అయినా కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మహిళలను కాపాడడానికి చాలా ప్రాధాన్యతను ఇచ్చారు..... ఈ క్రమంలోనే 1200ల మంది సైనికులలో 500ల మందిని మహిళల రక్షణ కోసం నియమించారు. ఆ సమయంలో ఖందకంను కాపాడుటకు మరియు 18 నుండి 20 వేల మంది ఉన్నటు వంటి శత్రుసైన్యంను ఎదుర్కొనుటకు అక్కడ కేవలం 700ల మంది సైనికులు మాత్రమే మిగిలిపోయారు " **(దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 274-275)**

హ్రజత్ అలీ రజి అమర్ బిన్ అబ్దే వృద్ధ ఆమిరీని హత్యచేయు ఘటన కూడ గలదు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. శత్రువు సైన్యం మదీనాను ముట్టడించిన సమయంలో వారి నాయకుడు అందరు కలిసి మూకుమ్మడిగా దాడి చేయాలని నిశ్చయించుకున్నాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు అనుచరుల వరకు తమ గుర్రపు సైన్యం చేరుకోవడానికి అనువైన మార్గం కోసం శత్రువులు అన్వేషించసాగారు. చివరికి ముసల్మానులు పట్టించుకోని ఒక ప్రాంతాన్ని కనుగొన్నారు. కావున ఇక్రమా బిన్ అబూ జహల్, నౌఫిల్ బిన్ అబ్దుల్లాహ్ మరియు జిరార్ బిన్ ఖత్తాబ్ మరియు హుబైర బిన్ అబూ వహ్హబ్ మరియు అమర్ బిన్ అబ్దే వుద్ లు ఆ ప్రాంతం నుండి ఖందకంను దాటి ముందుకు వచ్చారు. అమర్ బిన్ అబ్దే వుద్‌ను అరబ్ ప్రజలందరు ఒక వెయ్యి మందికి సమానమైన వీరుడిగా భావించేవారు. ఇతడు బదర్ యుద్ధంలో గాయపడ్డాడు. ఆ గాయాల కారణంగానే అతడు ఉహద్ యుద్ధంలో పాల్గొనలేదు. కావున అతడు " ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ను నవూజు బిల్లాహ్ హతమార్చనంత వరకు తన తలకు నూనెను పెట్టుకోని" అని ప్రమాణం చేశాడు. అతడు ఎంతో పొగరుగా గట్టిగా అరిచాడు. ఖందకాన్ని దాటి వచ్చి అతడు పెద్ద నినాదం చేశాడు. బిగ్గరగా అరిచాడు. ముసల్మానులను రెచ్చగొట్టాడు. ఓ స్వర్గాన్ని పొందాలని ఆకాంక్షించే ప్రజలారా రండి. నేను మిమ్ములను స్వర్గానికి చేర్చుతాను లేదా మీరు నన్ను నరకానికి పంపండి. అతని రెచ్చగొట్టు తనానికి ఎవరు పోటిగా నిలబడలేక పోవడంతో హ్రజత్ అలీ రజి పోటికి రంగంలో దిగుటకు నిలబడబోయారు. కాని ఆః హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఓ అలీ ! నీ ఎదురుగా అమర్ బిన్ అబ్దే వుద్ద్ ఉన్నాడు అని చెప్పి కూర్చోబెట్టారు. కాని అతడు రెండు లేదా మూడు సార్లు అలా పిలిచిన తరువాత హ్రజత్ అలీ రజి రంగంలోకి దిగారు. ఆ సమయంలో హుజూర్ (స) వారిని అడ్డుకోలేదు. ఆః హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వయముగా తమ తలపాగను హ్రజత్ అలీ రజి తలకు చుట్టారు. తమ ఖడ్గాన్ని ఇచ్చారు. దుఆలు చేస్తూ పోరాడుటకు పంపించారు. హ్రజత్ అలీ రజి ముందుకు వచ్చి అమర్ తో ఇలా అన్నారు. ఒకవేళ ఖురైష్‌లలో ఏ వ్యక్తి అయినా నీతో రెండు విషయాలను గూర్చి అడిగినచో నీవు అందులో ఒక దానిని తప్పకుండా స్వీకరిస్తాను అని వాగ్దానం చేసినట్లు నేను విన్నాను. అందుకు అమర్ అవును నిజమే అని సమాధానం ఇచ్చాడు. హ్రజత్ అలీ రజి మరల ఇలా అన్నారు. నేను నీతో కోరుకునే మొదటి విషయమేమనగా నీవు ఇస్లాంను స్వీకరించుము. ఆః హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించుతూ దేవుని అనుగ్రహాలకు వారసుడివి కమ్ము. అందుకు అమర్ అది జరుగని పని అని అన్నాడు. అప్పుడు హ్రజత్ అలీ రజి ఇలా అన్నారు. ఒకవేళ

| అహ్రదీస్ బోధనలు | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

మొదటి విషయం నీకు ఆమోద యోగ్యముగా లేనిచో రెండవ విషయమేమనగా, నీవు నాతో పోటి పడుటకు సిద్ధము కమ్ము. అందుకు అమర్ నవ్వాడు. ఆపై ఇలా అన్నాడు. ఎవరైనా నాతో ఇలా మాట్లాడుతారని నేను ఊహించలేదు. ఆ తరువాత అతడు హ్రజత్ అలీ రజి గారి పేరును, వంశ పారపర్యంను గూర్చి అడిగి తెలుసుకున్నాడు. హ్రజత్ అలీ రజి వివరాలు తెలియజేయగా, అతడు ఇలా అన్నాడు. నీ తండ్రి నాకు మంచి స్నేహితుడు. అందువలన నీవు వెళ్ళిపో, మరెవరినైన పంపించుము. హ్రజత్ అలీ రజితో అతడు ఓ నా సోదరుడి కుమారుడా! నీవు ఇంకా చిన్న వయస్సు గల వాడివి. నీ రక్తాన్ని కార్చాలని నేను చూడడంలేదు. మీలో పెద్ద వారు ఎవరైన ఉన్నచో వారిని పంపించుము అని అన్నాడు. అందుకు హ్రజత్ అలీ రజి అతనితో ఇలా అన్నారు. నీవు నా రక్తాన్ని చూడాలను కోవడం లేదు కాని, నేను నీ రక్తాన్ని చూడడానికి సమయాన్ని వృధా చెయ్యను. ఆ మాటలకు అమర్ ఉద్రేకానికి గురై, తన గుర్రం పై నుండి క్రిందికి దూకాడు. ఆ గుర్రపు మేకాళ్ళను నరికి దానిని నేలపై కూర్చోబెట్టాడు. ఆ తరువాత ఒక నిప్పు రవ్వ వలే పిచ్చిగా హ్రజత్ అలీ రజి పై దాడి చేయుటకు ముందుకు వచ్చాడు. ఎంతో బలంగా తన ఖడ్గంతో దాడి చేయగా ఆ ఖడ్గం హ్రజత్ అలీ రజి ఢాలును చీల్చుకుంటూ వారి నోసటి భాగంకు తగిలింది. వారిని కొంత వరకు గాయ పర్చింది. కాని వెంటనే హ్రజత్ అలీ రజి అల్లాహు అక్బర్ నినాదంను నినాదిస్తూ బలంగా దాడి చేశారు. ఆ దాడి నుండి అమర్ తనను తాను కాపాడుకోవడంలోనే ఉండిపోయాడు. ఆ క్రమంలోనే హ్రజత్ అలీ రజి ఖడ్గము అతని చాతి భాగం నుండి వెనుక భాగం వరకు కోసుకుంటూ వెళ్ళిపోయింది. అమర్ కొట్టుమిట్టాడు కుంటూ చివరికి ప్రాణాలను వదిలాడు.

కొన్ని కథనాలలో రెండు విషయాలకు బదులుగా మూడు విషయాలలో ఒక విషయాన్ని తప్పకుండా స్వీకరించుతానని అన్నావు. కావున మొదటి మాట ఏమిటనగా నీవు వెనుదిరిగి వెళ్ళిపోమ్ము. హ్రజత్ అలీ రజి ఎప్పుడైతే అతనితో నివు వెనుదిరిగి వెళ్ళిపొమ్ము అని అన్నారో అందుకు అతడు అలా జరుగదు అని సమాధానం ఇచ్చాడు. అప్పుడు రెండవ విషయాన్ని అనగా అలాగైనచో మరి ఇస్లాంను స్వీకరించుము అని మరియు మూడవ విషయం పోటి సిద్ధము కమ్ము అని కోరినట్లుగా గలదు. అమర్ హత్య చేయబడడంతో అతని మిగిలిన మిత్రులందరు కంపించి పోయారు. అందువలన తమ గుర్రాలతో సహా పారిపోయారు. హ్రజత్ జుబైర్ రజి వారిని వెంబడించారు, వారిలో ఒకరైన నౌఫిల్ బిన్ అబ్దుల్లాహ్‌ను హతమార్చినారు. అలా వారిలో ఒకరైన హుబైర విన్ అబూ వహ్హాబ్. ఇతడు హ్రజత్ అలీ రజి సోదరి ఉమ్మే హాని గారి భర్త అయినప్పటికి హ్రజత్ అలీ రజి అతనిపై ఖడ్గంతో దాడి చేయగా, ఆ దాడి అతని గుర్రపు వెన్నుపై పడడం వలన దాని వెన్ను విరిగిపోయింది. మరొక కథనములో ఇలా గలదు. అమర్ చనిపోయిన తరువాత హుబైరా మరియు జిరార్ బిన్ ఖత్తాబ్‌లు హ్రజత్ అలీ రజిపై దాడి చేయగా, హ్రజత్ అలీ రజి తిరుగు దాడి చేయడంతో వారు ఇరువురు పారిపోయారు. మరొక కథనములో హుబైరా తన కవచాన్ని వదిలి పారిపోయాడని గలదు. వాస్తవానికి హుబైరా ఖురైష్‌లలోనే ఎంతో అనుభవం ఉన్నటు వంటి గుర్రపు స్వారి గలవాడు.

మరొక కథనము ప్రకారం హ్రజత్ ఉమర్ సోదరుడైన జిరార్ బిన్ ఖత్తాబ్ (సీరతుల్ హలబియాలో జిరార్ బిన్ ఖత్తాబ్‌ను హ్రజత్ ఉమర్ రజి గారి సోదరుడిగా పేర్కొన్నారు. రచయిత బహుశా పొరపాటి పడి ఉండవచ్చును. నిజానికి హ్రజత్ ఉమర్ రజి సోదరుడే లేడు.) అతడు పారిపోవుచుండగా హ్రజత్ ఉమర్ రజి అతనిని వెంబడించారు. జిరార్ ఒక్కసారిగా ఆగి హ్రజత్ ఉమర్ రజిపై భర్చీతో దాడిచేయాలని చూశాడు. కాని చేయలేక పోయాడు. కాని హ్రజత్ ఉమర్ రజిను ఉద్దేశిస్తూ ఇలా అన్నాడు. ఉమర్! నేను నీపై దాడి చేయలేదు, కావున నా ఈ ఉపకారాన్ని నీవు గుర్తుంచుకో. మరల ఇలా లిఖించబడింది. హ్రజత్ ఉమర్ రజి అతని ఉపకారాన్ని గుర్తుంచుకోవడానికి ఏమి ఉన్నది?. జిరార్ ఏ ఉపకారం చేశాడని గుర్తుంచుకోవాలి. నిజానికి అల్లాహ్ అతనిపై ఉపకారం చేశాడు. బహుశా హ్రజత్ ఉమర్ రజి దుఆల ఫలితముగానే కావచ్చును చివరికి మక్కా విజయం రోజున ఈ జిరారే ఇస్లాంను స్వీకరించాడు. ఆపై ఇస్లామీయ యుద్ధాలలో పూర్తి శక్తిసామర్థ్యంతో పాల్గొన్నారు. ఎంతో వీరత్వాన్ని, నైపుణ్యాన్ని ప్రదర్శించారు. చివరికి యమామ యుద్ధంలో వీరమరణం పొందారు. కొందరి వారు అమరుడు కాలేదు, చాలా కాలం వరకు జీవించి సహజమైన మరణాన్ని పొందారని పేర్కొన్నారు. అమర్ బిన్ అబ్దే వుద్ద్ మరణించిన తరువాత అవిశ్వాసులు అతని మృతదేహాన్ని 10వేల దిర్హములకు

| అహ్రదీస్ బోధనలు | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Mahboobnagar, (Telangana)***

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 10. Thursday, 06 MAR 2025, Issue No - 10.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

కొనుగోలు చేస్తామని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు సందేశం పంపగా, హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం వారితో అతనిని తీసుకవెళ్ళండి, మేము శవాలతో వ్యాపారం చేయము అని అన్నారు. మరికొన్ని కథనాల ప్రకారంగా చూసినచో నౌఫిల్ బిన్ అబ్దుల్లాహ్ మరొక సందర్భములో హత్య చేయబడ్డాడని గలదు. దాని వివరాలను చూసినచో ఇలా గలవు. ఒక రోజు తన గుర్రంపై స్వారి చేస్తూ ఖందకాన్ని గుర్రంతో పాటు దూకడానికి ప్రయత్నించగా, అతని గుర్రం ఆ ఖందకాన్ని దూకలేక అందులోని పడిపోయింది. ఫలితముగా అతడు కూడ ఖందకంలో పడిపోయాడు. ఫలితముగా అల్లాహ్ తాలా అతనికి మరణాన్ని ఇచ్చాడు. ఎందుకనగా ఖందకంలో పడిపోవడం వలన అతని మెడ యొక్క వెముక విరిగిపోయింది.

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స) హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ రజి ఎం.ఏ పేజి 588-589) ( అల్ బదాయతు వన్నిహాయతు, సంపుటి 2, పేజి 115, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(సబీలుల్ హుదా సంపుటి 4, పేజి 377-378, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(సీరతుల్ హలబియా, సంపుటి 3, పేజి 20, దారుల్ మాఅరుఫ, బీరూట్)( అత్తబ్ఖాతుల్ కుబ్రా, భాగం 2, పేజి 283, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్) (ఘజ్వా అహజాబ్, బాష్మీల్ పేజి 225, నఫీస్ అకాడమీ కరాచీ) (అల్ అసాబా ఫి త్తమీజిస్సహాబ, సంపుటి 3, పేజి 392, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ లబ్నాన్ 1995)(సీరతున్నబవియ్యతు లి అబుల్ హసన్ నద్వీ , (భాగం 1, పేజి 353) మక్తబత షామిలతు)**

అన్యారాధులు అతని మృతదేహాన్ని తీసుకవెళ్ళడానికి ఒక బృంధాన్ని పంపించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు కొంత నగదును పరిహారంగా ఇవ్వాలని చూశారు. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి పరిహారం ను మాకు అవసరం లేదని తిరస్కరిస్తూ, అతనిని సమాధి చేయకుండా మేము మిమ్ములను అడ్డుకోమని అన్నారు.

**(సుబూలుల్ హుదా వర్రిషాద్ సంపుటి 4, పేజి 380, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు గారు నౌఫిల్ యొక్క మరణంను గూర్చిన ఘటనను ఇలా తెలిపారు. “ శత్రువులు ఖందకంపై నుండి దాడి చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో వారు ఆ ఖందాన్ని దాటడానికి చేసిన ప్రయత్నం కూడ ఫలించేది. ఈ క్రమంలోనే ఒక రోజు అన్యారాధులకు చెందిన ఒక ప్రముఖ సైన్యాధిపతి ఖందకమును దాటి ముసల్మానుల వైపు చేరుకున్నాడు. కాని ముసల్మానులు చేసిన దాడికి అతని తన ప్రాణాలను కాపాడుకోవడం కోసం వెనుదిరుగ తప్పలేదు. ఈ క్రమంలోనే అతడు ఖందకాన్ని మరల దాటుకు ప్రయత్నిస్తూ ఆ ప్రముఖ సైన్యాధిపతి మరణించాడు. అతని పేరు నౌఫిల్. ఇతడు ఎంత ప్రముఖమైన సైన్యాధిపతి అనగా ఒకవేళ అతని మృతదేహానికి కనుక అవమానం జరిగినచో అరబ్ మొత్తంలో ముఖము చూపించుటకు తమకు అవకాశమే ఉండదని శత్రువులు భావించారు. ఈ క్రమంలోనే వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఒక సందేశాన్ని పంపించారు. అదేమనగా, ఒకవేళ మీరు ఆ మృతదేహాన్ని తిరిగి మాకు అప్పగించినచో మేము బదులుగా మీకు 10వేల దిర్హములను చెల్లించుటకు సిద్ధముగా ఉన్నాము. బహుశా ఆ శత్రువులు ఇలా భావించి ఉండవచ్చును. అనగా ఏ విధముగానైతే తాము ముసల్మాను నాయకులను, నాయకులనే గాకుండా స్వయముగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి పిన్నాన్న గారి చెవులను, ముక్కును, ఇతర శరీర అవయవాలను కోసి అవమానం పరిచామో ముసల్మానులు కూడ మన నాయకుల చెవులు, ముక్కు, కన్నులను కోసివేసి మన జాతిని అవమాన పరుస్తారు అని భావించారు. కాని ఇస్లాం బోధనలు అందుకు పూర్తిగా విరుద్దమైనవి. మృతదేహాలను అవమాన పర్చుటకు ఇస్లాం బోధనలను అనుమతించవు. కావున శత్రువుల సందేశం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు చేరుకోగా, హుజూర్ (స) ఇలా అన్నారు. ఆ మృత దేహాన్ని మేము ఏమి చేసుకుంటాము. ఆ మృత దేహం మాకు ఏ విధముగాను పనికి రాదు. అయినా మేము మృతదేహాలకు పరిహారం తీసుకోము. మీ మృతదేహాన్ని ” అక్కడ పడి ఉన్న వ్యక్తి ది “ నిర్మోహ మాటంగా వచ్చి తీసుకవెళ్ళవచ్చును. దానికి మాకు ఎలాంటి సంబంధం లేదు అని అన్నారు. ”

**(దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 277-278)**

మొత్తానికి ఈ యుద్ధానికి చెందిన మరికొన్ని వివరాలు ఇక ముందు కూడ కొనసాగుతాయి. ఇన్షా అల్లాహ్.

ఈ వారంలో ఈ రోజు నుండే లజ్నా మరియు అన్సారులా వార్షిక సమావేశాలు ప్రారంభమవుచున్నాయి. నేను ముందుగా యువకులకు తెల్పినట్లుగా, ఈ ఇరువురికి కూడ అనగా లజ్నాకు మరియు అన్సారులకు కూడ తెల్పునదేమనగా, ఈ రోజులను ప్రత్యేకించి దుఆలో గడపండి. దరూద్‌లను చదువుటకు ఎక్కువగా ప్రయత్నించండి.

అల్లాహ్ తాలా మీ అందరికి ఇట్టి భాగ్యమును కల్గించుగాకా!. ఇజ్తిమాల ఉద్దేశాలను నెరవేర్చుటకు ప్రయత్నించుదురు గాకా! అంతేగాని వినోదంను పంచే కార్యక్రమాలలో పాల్గొనడం, లేదా అనవసర విషయాలతో సమయం వృధా చేయడం వంటివి చేయకూడదు. అల్లాహ్ తాలా అన్ని విధాలుగా ఈ సమావేశలను శుభ ప్రదం చేయుగాకా!.

**(అల్ ఫజల్ ఇంటర్నేషనల్, 18 అక్టోబర్, 2024, పేజి 2-6)**

---

**(1వ పేజి తరువాత తఫ్సీర్)**

అంతేగాని వీరు వ్యవస్థతో అనుసంధానమై ఉండరు. ఇందుకు ఉదా॥ హజ్రత్ అలీ రజియల్లాహు అన్‌హు కాలంలో వెలిసినటు వంటి ఖ్వారిజ్‌లు. కొన్నిసార్లు కొంత మంది నా పేరుకోసం అనుసంధానమై ఉండరు, నా వ్యవస్థలతో అనుసంధానమై ఉండరు. ఇందుకు ఉదా॥ మక్కాకు చెందిన అవిశ్వాసులు, యూదులు మరియు క్రైస్తవులు. వీరందరు కలిసి ఏ లక్ష్యమును నెరవేర్చుట కొరకు అల్లాహ్ తాలా ఈ ప్రపంచంపైకి ప్రవక్తలను అవతరింపజేస్తాడో ఆయా లక్ష్యాలను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. వారి మార్గంలో రకరకాల సమస్యలను సృష్టిస్తారు. కాని అల్లాహ్ తాలా తన సంకేతాల ద్వార తన ప్రవక్తలకు సహాయంను అందిస్తాడు. షైతాన్‌కు దాని అన్ని రకాల కుయుక్తులలో అపజెయాన్ని కల్గిస్తాడు. వాస్తవమేమనగా, ఏ విధముగానైతే ఒక వేట కుక్కకు ఒక దొంగ బట్టలను వాసన చూపించి విడిచిపెట్టినచో అది 10, 20 మైళ్ళ దూరం కాకుండా 100 మైళ్ళ దూరం వరకైన పరుగెత్తుకెళ్ళి ఆ దొంగను పట్టుకుంటుంది. అదే విధముగా షైతాన్‌కు కూడ పవిత్రమైన సువాసన అంటే పడదు. అందుకే దానిపై అది పిచ్చోడి వలే దాడి చేస్తుంది. ఎవరి నుండి అట్టి పవిత్రమైన సువాసన వస్తుందో అతడిని పట్టుకోని చీల్చి చెండాడాలని ప్రయత్నిస్తుంది. అందుకే ఎప్పుడైతే హజ్రత్ ఆదమ్ అలైహిస్సలాం అల్లాహ్ తాలాతో పవిత్రమైన పరిమళాన్ని పొందారో అప్పుడు అది హజ్రత్ ఆదమ్ అలైహిస్సలాం వెనకాల పరుగెత్తింది. ఆ తరువాత హజ్రత్ నూహ్ అలైహిస్సలాం అవతరించి, అల్లాహ్ తాలా నుండి వారు పవిత్రమైన పరిమళాన్ని పొందారో అప్పుడు అది వారి (అ) వెనకాల పరుగెత్తింది. ఆ తరువాత హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం అవతరించారు. వారి ద్వారా ఈ పరిమళం వ్యాపించగా, ఆ షైతాన్ వారి (అ) వెనకాల కూడ పరుగెత్తింది. అదే విధముగా హజ్రత్ రాముడు, హజ్రత్ క్రిష్ణుడు, హజ్రత్ జర్తిస్ట్, హజ్రత్ ఈసా (అ) మరియు హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అవతరించినప్పుడు కూడ ఆ షైతాన్ వారందరి వెనకాల పరుగెత్తింది. ఒకవేళ వీరందరిలో ఒకే రకమైన పరిమళ వాసన లేకున్నచో, వీరిపై షైతాన్ ఒకే విధముగా దాడి చేసి ఉండేది కాదు. నిజానికి వీరందరిలో ఒకే రకమైన పరిమళం ఉన్నది. ఆ పరిమళం దైవ ఏకత్వపు పరిమళం. అందుకే షైతాన్ కూడ వారి అందరి కాలములలో ఒకే విధమైన దాడికి పాల్పడింది. కాని ఇలా తెల్పడం జరిగింది. **ఫయన్‌సఖుల్లాహు మా యుల్‌ఖీ షైతాను సుమ్మ యుహ్‌కిముల్లాహు ఆయాతిహీ వల్లాహు అలీముమ్ హకీమ్.** అనగా అల్లాహ్ తాలా షైతాన్ యొక్క అన్ని రకాల ఆటంకాలను తొలిగించును. తన వైపు నుండి అవతరించు నట్టి బోధనలను ఆచరింపజేయును. అల్లాహ్ తాలా సర్వజ్ఞుడు, వివేకవంతుడు.

**(తఫ్సీరే కబీర్ సంపుటి 6, పేజి 71, ప్రచురణ ఖాదియాన్ 2010)**

**నూరుల్ ఇస్లాం శాఖ:**

---

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**
**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**
**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz